# 2

# కొలొస్సయులను బట్టి పౌలు దేవునికి కృతజ్ఞతలు చెల్లించుచున్నాడు

## కొలొస్సయులకు 1:3-8

శుభాభివందనములు తెలిపిన తరువాత, వారి విశ్వాసము, ప్రేమ మరియు నిరీక్షణనుబట్టి ఆయన వారి కొరకు కృతజ్ఞతాపూర్వకంగా ప్రార్థించుచున్నాడని పౌలు కొలొస్సయులకు తెలియజెప్పాడు. సువార్త సత్యమును నేర్చుకొనిన తరువాత, వారు ఫలించుటకు మొదలుపెట్టి యేసు కొరకు ఫలించుచునే యుండిరి పౌలుకు ప్రియమైనవాడును, క్రీస్తు సువార్త ప్రకటన విషయంలో జతపనివాడునైన ఎపఫ్రా, వారు ప్రేమపూర్వకమైన పనులు చేయుచుండవలెనని వారికి బోధించాడు మరియు ఆయన వారికి నేర్పించినట్లుగానే వారు చేయుచున్నారని పౌలుకు సమాచారము నందించాడు.

కొలొస్సయులనుబట్టి పౌలు దేవునికి కృతజ్ఞుడై యుండిన విషయములు 3–8 వచనములలో వ్రాయబడి యున్నవి. ఆయన తన పత్రికలలోని అభివందనములను స్తుతి మరియు కృతజ్ఞతావందనములతో ప్రత్యేకమైన రీతిలో మొదలుపెట్టు ఆయన ప్రశంసింపగోరిన ప్రత్యేక లక్షణములను లేక కార్యములను ఆ తరువాత పేర్కొన్నాడు. ఇవి కొన్ని పర్యాయములు శిక్షార్థమైన గద్దింపులు, మందలింపులు, మరియు పాఠకుల ఆధ్యాత్మిక మేలును కోరిన ఆదేశములై యుండినవి.

### కృతజ్ఞతాస్తుతులతో కూడిన ప్రార్థన (1:3)

**3మేము విని యెల్లప్పుడు మీ నిమిత్తము ప్రార్థనచేయుచు, మన ప్రభువగుయేసు క్రీస్తు యొక్క తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.**

**"మేము దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము" (1:3, 4)**

**మేము** అను మాట పౌలు మరియు తిమోతిని సూచింపవచ్చును లేదా అది మామూలుగా పౌలు చేత ఇతర పత్రికలలో వాడబడిన ఒక సంపాదకీయమైన "మేము" అయియుండవచ్చును (1 కొరింథీయులకు 2:6, 7; 2 కొరింథీయులకు 4:1, 2). పౌలు ఈ పత్రికలో "నేను" అని ఉపయోగించుట (ఉదా॥ 1:23, 24, 25, 29; 2:1, 5), కొలొస్సయులకు ఈ పత్రికను వ్రాసినది పౌలే అనియు, తిమోతి కాదనియు, సూచించుచున్నది. "పౌలును నేను, నా స్వహస్తముతో నా వందనములు వ్రాయుచున్నాను" అని ఆయన చేయుచున్న ప్రకటన (కొలొస్సయులకు 4:18) ఈ పత్రిక రచయిత ఆయనే అని విశదంగా చూపించుచున్నది.

కొలొస్సయులనుబట్టి పౌలు చేయుచుండిన ప్రార్థన కేవలము దేవుడు వారిపై ఆయన తన దీవెనలు కుమ్మరింపవలెనని వారి పక్షమున చేయుచుండిన ఒక విన్నపము మరియు

మనవి కాదు. ఆ ప్రార్థనలో కృతజ్ఞత మరియు ధన్యవాదములు కలిసియుండినవి.

**కృతజ్ఞతలు** (*eucharisteō*) అను పదము నాలుగు పత్రికలలో (గలతీయులకు, 2 కొరింథీయులకు, 1 తిమోతి, మరియు తీతు)[1] తప్ప భవిష్యత్తులో పాఠకులై యుండువారికి సంబంధించినంత వరకు ఆయన రచించిన మిగిలిన అన్నింటిలోను ఉన్నది. బహుశా ఇటువంటి రసమయమైన అభిమానములు అర్థమైయున్నవని ఆయన అనుకొన్నప్పుడు మాత్రమే ఆయన కృతజ్ఞతలు తెలియజేసాడని ఇది సూచింపవచ్చును. వారి గూర్చి ఆయన మరియు తిమోతి ప్రార్థన చేసినప్పుడెల్లా వారు దేవునికి హృదయపూర్వకముగా కృతజ్ఞులైయుంటున్నారని కొలొస్సయులకు పౌలు తెలియజేసాడు. వారి గూర్చి ఎపఫ్రా అందించిన ఖ్యాతిగల నివేదిక ఆధారంగా పౌలు తన కృతజ్ఞతను దేవునికి తెలుపుకొన్నాడు (కొలొస్సయులకు 1:7, 8). క్రీస్తు సేవ నిమిత్తము ఆయన చేసికొనిన సమర్పణ తన తోటి క్రైస్తవులనుబట్టి ఆయన ఆనందించుటకు లేదా దుఃఖించుటకు కారణమయ్యింది (2 కొరింథీయులకు 7:7, 8; 1 థెస్సలొనీకయులకు 3:9). ఆయన యొక్క కృతజ్ఞత **దేవునికి** సహేతుకముగా తెలియజేసికొనబడినది, ఏలయనగా సమస్త ఆధ్యాత్మిక ఆశీర్వాదములకు ఆయనే కారణభూతుడై యున్నాడు (ఎఫెసీయులకు 1:3) మరియు కొలొస్సయులను ఆశీర్వదించినది కూడ ఆయనే.

**"మన ప్రభువగు యేసు క్రీస్తు యొక్క తండ్రి" (1:3)**

యేసుకు దేవునితో గల సంబంధమును వర్ణించుటకు పౌలు "తండ్రి" అను పదమును వాడుచున్నాడు (రోమీయులకు 15:5, 6; 2 కొరింథీయులకు 1:3; 11:31). తండ్రిని గూర్చి ప్రస్తావించినప్పుడు యేసు, "నా తండ్రి" అని సూచించాడు (ఉదా॥ మత్తయి 7:21; 10:32, 33; లూకా 10:22; 24:49 చూడుము). ఆయన "నా తండ్రి" మరియు "నా దేవుని" యొద్దకు ఆరోహణముకానున్నాడని మగ్దలేనే మరియతో చెప్పాడు (యోహాను 20:17).

**మన ప్రభువగు యేసు క్రీస్తు యొక్క తండ్రి** గూర్చి తలంచినప్పుడు, యేసును తండ్రి వలన కలిగిన ఒక కుమారునిగా చేయుచు, శారీరిక సంబంధమైన మూలముగల దృక్పథంతో ఆలోచించకూడదు. "తండ్రి" అని పౌలు ప్రయోగించుట పాత నిబంధన ఆలోచనను ప్రతిబింబించుచున్నది. "నేను మీకు తండ్రినై యుందును, మరియు మీరు నాకు కుమారులును కుమార్తెలునై యుందురు" అని దేవుడు సెలవిచ్చాడు (2 కొరింథీయులకు 6:18; 2 సమూయేలు 7:14; 1 దినవృత్తాంతములు 17:13 చూడుము). కీర్తనలు 2:7ను ఉల్లేఖించుచు హెబ్రీయులకు 1:5 ఇదే ఆలోచనను యేసుకు అన్వయించుచున్నది.

"మన ప్రభువగు యేసు క్రీస్తు యొక్క తండ్రి" అను మాటల్లో మూలము కంటే, విశేషంగా సంధము, ప్రతిబింబింపబడుచున్నది. ఒక విధంగా, యేసు దేవుని కుమారుడని పిలువబడుచున్నాడు ఏలయనగా మరియను పరిశుద్ధాత్మ కమ్ముకొనినందువలన ఆమె దాల్చిన గర్భమునందు యేసు భౌతిక శరీరముతో పుట్టెను (మత్తయి 1:18; లూకా 1:35, 36). గనుకనే తద్వారా ఆయన భౌతిక జననము సాధ్యమయ్యింది. ఏదిఏమైనా, ఆయన ఈ భౌతిక జననమునకు మునుపే ఉన్నాడు. లోకము సృజింపబడక మునుపే (యోహాను 17:5), ఆదియందు ఆయన తండ్రితో కూడ ఉండెను (యోహాను 1:1). సమస్తమును ఆయన మూలముగా కలిగెను (యోహాను 1:3, 10; కొలొస్సయులకు 1:16). యేసు కలిగియుండిన

నిత్యమైనదియు, దైవికమైనదియు, ఆత్మ సంబంధమైనదియునైన స్వభావము భౌతిక తండ్రి వలన కలిగినది కాదు. ఆయన అనాది నుండే ఉన్నాడు (మీకా 5:2).

ఆయన తండ్రితో కలిగియుండిన సాంగత్యమునుబట్టి యేసు "దేవుని కుమారుడు" అని పిలువబడెను. యేసు ఎంత గొప్ప సన్నిహితమును, జాలిగలదియునైన ప్రేమపూర్వక సంబంధమును తండ్రితో పంచుకొనుచున్నాడో ఇటువంటి పరిభాష ప్రకటించును (యోహాను 15:9). "తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే" అను మాటల్లో ఈ భావన అభివ్యక్తము చేయబడినది (యోహాను 1:18).

వారు ఇద్దరు వేరువేరు వ్యక్తులని "యేసు క్రీస్తు యొక్క తండ్రి" అను ప్రస్తాపన సూచించుచున్నది. తండ్రి మరియు కుమారుడు, యేసు, ఏకమై యున్నారు (యోహాను 10:30), కానీ వారు యిరువురూ ఒకరే కారు. కుమారుడు తీర్పు తీర్చును, కానీ తండ్రి కాదు (యోహాను 5:22). యేసు తిరిగి ఎప్పుడు వచ్చునో తండ్రికి తెలియును, కానీ తనకు తెలియదని కుమారుడు తెలియజెప్పాడు (మార్కు 13:32). యేసు ఇప్పుడు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచిన – తండ్రిపై తప్ప – సమస్తముపై అధికారియై యున్నాడు (1 కొరింథీయులకు 15:27, 28).

తండ్రి మరియు కుమారుని ఏకత్వము ఆత్మ వ్యక్తులైయున్నవారి మధ్య మాత్రమే నెలకొనియుండగల ఏకత్వమై యున్నది. భౌతిక శరీరముగలవారు అక్షరాలా ఏకమై యుండజాలరు, ఏలయనగా భౌతిక దేహములు ఎల్లప్పుడు విశిష్టిముగా వేరువేరైనవై యుండును. ఆత్మవ్యక్తుల రూపం మానవాళికి తెలియదు గనుక, వారు ఏకమై యుంటూనే ఎలా విశిష్టముగా వేరువేరైనవారై యుండగలరో మనము అర్థం చేసికొనలేకపోవుచున్నాము. భౌతిక దేహముగలవారు ఒకరిలో మరొకరు ఉండజాలరు. అట్లయినను యేసు తండ్రియందున్నాడు మరియు తండ్రి యేసునందున్నాడు: "తండ్రి నాయందును నేను తండ్రియందును ఉన్నాము" (యోహాను 10:38); "తండ్రియందు నేనును నాయందు తండ్రియు ఉన్నాము" (యోహాను 14:10, 11, 20). వారు ఏకమై (can be one) యుండగలరు (యోహాను 10:30) అట్లయినను ఇద్దరై యున్నారు (యోహాను 8:17, 18) ఏలయనగా వారు ఆత్మలై యున్నారు, భౌతిక దేహముగలవారు కారు.

"తండ్రి"లో గౌరవము మరియు ఇష్టపూర్వకముగా చూపించబడు విధేయత అనే అభిప్రాయము కలిసియున్నది (హెబ్రీయులకు 5:8; ఫిలిప్పీయులకు 2:8). ఈ సంబంధము పరిపూర్ణుడైన కుమారుడు వాని తండ్రితో కలిగియుండునదై యున్నది, ఈ ఇరువురు వ్యక్తులు సమానులై యున్నారు. ఆయన మానవ జాతి నిమిత్తము దాసుడగునట్లు మానవ స్వభావమును ధరించినప్పుడు క్రీస్తు ఈ సమానత్వమునకు సంబంధించిన కొన్ని కోణములను తాత్కాలికముగా త్యజించాడు (ఫిలిప్పీయులకు 2:6, 7).

ఒకని తండ్రి కలిగియున్న అదే స్వభావమును కుమారుడు కూడ కలిగియుండును. తండ్రి, దేవుడైయున్నట్లయితే, కుమారుడు సయితము దేవుడై యుండి దేవునితో సమానుడై యుండును. దేవుడు ఆయన తండ్రియై యున్నాడని యేసు ప్రస్తావించినప్పుడు యూదులు ఈ అభిప్రాయమును చిత్రీకరించుకొన్నారు గనుక వారు ఆయనను హింసించారు. దేవునిని తన తండ్రి యని సంబోధించుటనుబట్టి, "ఆయన తనను తాను దేవునితో సమానునిగా చేసికొనుచున్నాడని" వారు అర్థంచేసికొన్నారు (యోహాను 5:18).

"మన ప్రభువు" అని మనము చెప్పుకొన్నప్పుడు క్రీస్తు మనకు మాత్రమే ప్రభువు మాత్రమే అయియున్నాడని దాని అర్థంకాదు – అనగా, క్రీస్తు క్రైస్తవులకు ప్రభువు మాత్రమే అని అర్థం కాదు. ఆయన భూమ్యాకాశములకు ప్రభువై యున్నాడు (మత్తయి 28:18). ఏదిఏమైనా, యింకా కొంచెము సంకుచితమైన భావముతో చూచినట్లయితే, యేసు క్రైస్తవులకు మాత్రమే, ఆయనను వారి ప్రభువుగా అంగీకరించి ఆయనను తప్ప ఇతర ప్రభువులను ఎవరినైనను సేవింపనివారికి మాత్రమే, ప్రభువై యున్నాడు. ఆయన వారి ఒక్కడే ప్రభువై యున్నాడు (1 కొరింథీయులకు 8:6). ఆచరణలో, ఇది ఎల్లప్పుడు వాస్తవమై యుండకపోవచ్చును; కానీ, ఉద్దేశమునకు సంబంధించినంత వరకు, వారి లక్ష్యము ఇదే. ఆయనను వెంబడించనివారు ఆయనను వారి ప్రభువుగా గౌరవించరు లేదా ఆయన వారి జీవితములకు ప్రభువై యున్నాడని అంగీకరించరు.

"ప్రభువు" (*kurios*) అనగా, సర్వోచ్ఛమైనవాడు, పై అధికారి, మరియు పరిపాలకుడని అర్థము. అపొస్తలుల కార్యములు 25:26లో రాజైన అగ్రిప్ప ఈ విధంగా సంబోధింపబడినాడు. కొన్ని సందర్భములలో, "ప్రభువు" అను మాట కేవలము గౌరవమును తెలిజేయును; ఉదా॥ ఒక బానిస యొక్క యజమానికి ఈ పదము వాడబడవచ్చును (మత్తయి 18:25–34). క్రొత్త నిబంధనలో దేవుడు, తండ్రియైన దేవుడు ప్రస్తావింపబడినప్పుడు ఈ పదము తరుచుగా వాడబడినది (మత్తయి 11:25), కానీ అతి తరుచుగా యేసు, కుమారుడైన యేసు ప్రస్తావింపబడినప్పుడు వాడబడినది (యోహాను 13:14; 1 కొరింథీయులకు 8:6).

### "యెల్లప్పుడు మీ నిమిత్తము ప్రార్థన చేయుచు" (1:3)

ఆయన నిరంతరము ప్రార్థించుట మాత్రమే కాదు, కానీ ఇతరులు సహితము యెడతెగకుండా ప్రార్థింపవలెనని పౌలు వారిని హెచ్చరించాడు (1 థెస్సలొనీయులకు 5:15). ఎల్లప్పుడు ప్రార్థన చేయుడి మరియు **యెడతెగక ప్రార్థనచేయుడి** అని పౌలు చెప్పుచున్నాడంటే, "అదే పనిగా" లేదా "అంతులేకుండా" ఎన్నటికినీ ఆపుజేయకుండా ప్రార్థించుచునే యుండవలెననునది పౌలు భావము కాదు. ఆయన అనుదిన ప్రార్థనల గూర్చి ప్రస్తావించుచుండెను.

ప్రార్థనలకు పౌలు అత్యధిక ప్రాధాన్యత నిచ్చాడని మనము అపొస్తలుల కార్యములలో చూడగలము. యేసును ఎదుర్కొనిన తరువాత (అపొస్తలుల కార్యములు 9:11), సంఘ పెద్దలను నియామకము చేయక మునుపు (అపొస్తలుల కార్యములు 14:23), మరియు ఫిలిప్పీలోని చెరసాలలో ఉన్నప్పుడు ఆయన ప్రార్థించాడని మనము చదువుచున్నాము. ఆయన వారిని విడిచిపెట్టి వెళ్లిపోక మునుపు తోటి సహోదరులతో కలిసి ప్రార్థించాడు (20:36; 21:5). ఆయన దేవాలయములో ఉన్నప్పుడు ప్రార్థించాడు (22:17) మరియు పొప్లి యొక్క తండ్రిని స్వస్థపరచక మునుపు ప్రార్థించాడు (28:8). ఆయన క్రైస్తవుల కొరకు మాత్రమే ప్రార్థన చేయలేదు,[2] కానీ క్రైస్తవేతరుల కొరకు కూడా ప్రార్థించాడు.

పౌలు వారి కొరకు ప్రార్థించుచున్నాడని తెలియుట కొలొస్సయులకు ఒక గొప్ప ప్రోత్సాహకమై యుండును. పౌలు మాదిరిని అనుకరించుచు, క్రైస్తవులు క్రీస్తునందున్నవారి నిమిత్తము కృతజ్ఞతగల వందనములతో ప్రార్థించుట కొనసాగుచుండవలెను.

## వారి విశ్వాసము మరియు ప్రేమ (1:4)

**[4]క్రీస్తు యేసునందు మీకు కలిగియున్న విశ్వాసమును గూర్చియు పరిశుద్ధులందరి మీద మీకున్న ప్రేమను గూర్చియు మేము విని.**

**"క్రీస్తు యేసునందు మీకు కలిగియున్న విశ్వాసమును గూర్చి మేము విని" (1:4)**

**వినబడెను** (*akousantes*) అని అనువదింపబడిన మాట యొక్క వ్రాతమూలకమైన రూపము క్రొత్త నిబంధనలో తరుచుగా అగుపించును. ఇది గ్రీకు వ్యాకరణములో ఒక సంఘటన జరిగినట్లు మాత్రము సూచించు అసమాపక క్రియాపదమై యున్నది మరియు 3వ వచనములోని "మేము విని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము" అను క్రియకు ఆధారమైనదై యున్న.[3] "విని" యొక్క చర్య కృతజ్ఞతాస్తుతులకు మునుపు జరిగిపోయింది. ఇదే గ్రీకు నిర్మాణము, "నమ్మిన" మరియు "బాప్తిస్మము పొందిన" అను మాటలు కూడ అసమాపక క్రియలుగా మార్కు 16:16లో అగుపించుచు, అవి "రక్షింపబడును" అను ప్రధాన క్రియకు తప్పనిసరిగా ముందుండువలెనని అర్థమిచ్చున్నవి.

ఎపఫ్రా మరియు బహుశా ఇతరులు అందించుచుండిన నివేదికల ద్వారా కొలొస్సయుల జీవితముల గూర్చి పౌలు మరియు తిమోతి తెలిసికొనుచుండిరి. పౌలుకు అందించిన నానావిధ సంఘములకు సంబంధించిన నివేదికలలో సంఘముల సత్‌ప్రవర్తన, దుష్‌ప్రవర్తన, సంఘ సంబంధమైన సమస్యలు, మరియు అబద్ధ బోధల గూర్చి నివేదింపబడి యుండినది. కొరింథీయుల గూర్చి క్లోయె యింటివారు ఆయనకు తెలియజెప్పారని చెప్పుచు, కొన్ని పర్యాయములు ఇటువంటి నివేదికల మూలాధారమును కూడ పేర్కొన్నాడు (1 కొరింథీయులకు 1:11). సంఘ సమాజములలోని పరిస్థితులను గూర్చిన సమాచారమును పౌలుకు పరిశుద్ధాత్మ సయితము బయలుపర్చాడు (1 కొరింథీయులకు 5:3; కొలొస్సయులకు 2:5). ఇతర సందర్భాల్లో, ఎవరి ద్వారా అందినదో చెప్పకుండా ఆయనకు సమాచారము అందినదని మామూలుగా మాత్రమే పేర్కొన్నాడు (1 కొరింథీయులకు 5:1; 1 థెస్సలోనీకయులకు 1:9).

సంఘముల నుండి ఆయనకు అందిన నివేదికల పట్ల పౌలు సాధారణంగా ప్రతిస్పందిచాడు. ఫిలిప్పీలో, ఇరువురి మధ్య భేదాభిప్రాయములు నెలకొనియుండిన – యువొదియ మరియు సుంటుకే పేర్లను – పౌలు పేర్కొన్నాడు, అది పరిష్కరింపబడవలసిన సమస్యయై యుండినది (ఫిలిప్పీయులకు 4:2). వారి గూర్చి తగు హెచ్చరిక పాటింపవలసినదని చెప్పుచు, పౌలు 2 తిమోతి 2:16–18లో హుమెనైయు మరియు ఫిలేతు పేర్లు కూడ పేర్కొనుచున్నాడు. దేమా, పౌలును వదలిపెట్టి వెళ్లిపోయినవాని పేరు, 2 తిమోతి 4:10లో పేర్కొనబడినది. భేదాభిప్రాయములుండిన ఇద్దరు స్త్రీలకు సహాయము చేయవలెననియు, అబద్ధ బోధకులకు విరోధముగా వారిని హెచ్చరించవలెననియు, విశ్వాస మతభ్రష్టుడైన ఒక సహోదరునికి సంబంధించిన నివేదికను సమర్పించవలెనను సదుద్దేశముతో పౌలు వీరందరి గూర్చి వారిని హెచ్చరించుచున్నాడు.

మనము "ఒకరికి విరోధముగా ఒకరము మాటలాడకూడదు" అనియు (యాకోబు 4:11) లేదా "ఒకని మీద ఒకరము సణగకూడదనియు" (యాకోబు 5:9) యాకోబు రచించాడు. క్రైస్తవులు సంఘములుగాను వ్యక్తిగత భక్తులుగాను జీవించుచున్న

తప్పుడు జీవన విధానములకు సంబంధించిన నివేదికలు వ్యర్థమైనవియు పనికిరానివియునైన సుద్దులై యున్నవా? వ్యర్థమును పనికిరానివియునైన సుద్దులు – ఎటువంటి సదుద్దేశము లేకుండానే ఇతరుల విషయములలో జోక్యము కలుగజేసికొనుట – ఇతర చెడు అభ్యాసములతో పాటు ఒక జాబితాగా తెలిజేయబడినది మరియు అది ఖండింపబడినది (రోమీయులకు 1:29; 2 కొరింథీయులకు 12:20; 1 తిమోతి 5:13; 2 తిమోతి 3:3; తీతు 2:3). ఇతరుల గూర్చి ఈ విదంగా ముచ్చటించుకొనుట వారిలో నమ్మకముంచుటకును లేక ఒక నివారణోపాయమును కనుగొనునట్లు ఏదైన ఒక సమస్య గూర్చి చర్చించుటకును భిన్నముగా నున్నది.

కొలొస్సయిలోని సోదర సోదరీమణులకు సంబంధించి పౌలు పొందుకొన్న నివేదిక మంచిదై యుండినది. ఇతరులు వారి విశ్వాసము గూర్చి, వారిని క్రీస్తునందు రాచభక్తిగల సభ్యులను చేసిన విశ్వాసము గూర్చి చెప్పుకొనుచుండిరి. యేసు మత్తయి 5:14బి లో వర్ణించినవారి వలె వారుండిరి: "కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు." ఇతరులు వారి విశ్వాసము గూర్చి విని ప్రోత్సాహింపబడునట్లు జీవించుట క్రైస్తవులందరి లక్ష్యమై యుండవలెను,

4, 5 వచనములలో, పౌలు పత్రమును చేర్చియున్నాడు: "విశ్వాసము," "ప్రేమ," మరియు "నిరీక్షణ." క్రొత్త నిబంధన రచయితలు తరుచుగా వీటిని జోడించుచుండిరి.[4] పౌలు చేర్చిన ఈ మూడు మాటలను జే. బి. లైట్‌పుట్ ఈ క్రింది విధముగా సంక్షిప్తము చేసాడు:

> మీరు యేసు క్రీస్తునందు కలిగియున్న *విశ్వాసము*, దేవుని ప్రజలందరి యెడల మీరు కనుపర్చు *ప్రేమ*, మీరు ఎదురుచూచుచున్న పరలోకమందు మీ కొరకు మున్ముందున్న జీవితము నిమిత్తము ఒక నిక్షేపముగా దాచబడియున్న *నిరీక్షణ* గూర్చిన వర్తమానమునుబట్టి ఆ హృదయములు కృతజ్ఞతాభావముతో నిండియున్నవి.[5]

ఈ ఏర్పాటులో నున్న యేసు **క్రీస్తునందలి విశ్వాసముతో** వ్యాఖ్యానకర్తలు పెనుగులాడుచున్నట్లున్నది. సంబంధిత ఆలోచనలలో గల ఈ క్రింది విభిన్నతలను గమనించండి. మొదటిదిగా, హెర్బర్ట్ ఎమ్. కార్సన్ ఇలా వ్రాయుచున్నాడు,

> యేసు *క్రీస్తునందు* అను పదజాలము ఈ సందర్భములో యేసుక్రీస్తు వారి విశ్వాసమునకు చేతితో తాక గలిగిన మరియు కంటితో చూడగలిగిన వస్తువైయున్నాడను అర్థమిచ్చుటలేదు, అయినను ఇది వాస్తవమై యున్నది, ఏలయనగా అలా కానట్లయితే ఈ విషయంలో విభక్తిగా ముందు చేర్చబడు *eis* or *epi* అవసరమగును. మనము 2వ వచనంలో గమనించినట్లు విశేషంగా అది పౌలు సుపరిచితముగా వాడుచున్న పదజాలమై యున్నది. వారు *క్రీస్తునందున్నారని* చెప్పుకొనబడుచున్న భావములో వారి జీవితములకవసరమైన సత్తువగల సారమును ఆయన నుండి పొందుకొనుచున్నారను విషయము దాగియున్నది ... ఈ విధంగా వారు ప్రదర్శించు విశ్వాసము దాని ప్రాణాధారమైన జీవమును వారు క్రీస్తుతో కలిగియున్న సన్నిహిత సంబంధము నుండి పొందుకొనుచున్నది. ఈ విశ్వాసము అభ్యసింపబడుచుండుట వారు ఆయనతో కలిగియున్న ఐక్యత చేత అదుపుచేయబడుచున్నది.[6]

లైట్‌పుట్ ఈ అభిప్రాయముతో ఏకీభవించుచున్నాడు:

> ఇచ్చట మరియు దీనికి సమాంతరమైన ఎఫెసీయులకు 1:15లోని వాక్యభాగములో

ముందుగా చేర్చబడిన విభక్తి పదము *en*. వారి విశ్వాసమునకు దారి చూపించు వస్తువు కంటే విశేషంగా అది ప్రయోగింపబడు పరిధిని సూచించుచున్నది (1 కొరింథీయులకు 3:5తో పోల్చి చూడుము); ఏలయనగా, వారి విశ్వాసము వస్తువుకు సంబంధించినదై యున్నదను అర్థమే అయితే, స్వాభావికముగానే *epi* or *eis* అనునవి విభక్తి పదములై యుండును (ఉదా।। 2:5).[7]

ఎఫ్. ఎఫ్. బ్రూస్ దృక్పథము కొంచెము భిన్నముగా నున్నది:

ఇచ్చట నున్న "యేసు క్రీస్తు" అను పదజాలము వారు తమ విశ్వాసమును అభ్యసించుటకు అనువైన సజీవ వాతావరణ వస్తువువలె అంతగా దృష్టింపబడవలసిన అవసరంలేదని అగుపించుచున్నది; అనగా, అపొస్తలుడు పేర్కొనుచున్న విశ్వాసము వారు "క్రీస్తునందున్న" స్త్రీపురుషులుగా కలిగియున్న విశ్వాసమైయున్నదని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.[8]

ఏ. టి. రాబర్ట్సన్ దీనికి మరొక కోణాన్ని అదనంగా చేర్చుచు ఇలా చెప్పుచున్నాడు, "వారి విశ్వాసము యేసుక్రీస్తు పరిధిలోపల పనిచేయుచుండినది (2 తిమోతి 1:13). అది భక్తిశ్రద్ధలను మించినదై యున్నది; అది క్రీస్తునందలి అంతర్గర్భిత నమ్మకమై యున్నది ..."[9]

మొత్తంమీద, "యేసు క్రీస్తు నందు" అను పదజాలము క్రైస్తవులు యేసుతో కలిగియుండు సంబంధమును వర్ణించుటకు సర్వసాధారణంగా పౌలు చేత వాడబడినది. ఈ పదజాలము వారు ఆయనతో కలిగియుండిన సన్నిహిత సంబంధమును మరియు ఆయన సమకూర్చు ఆశీర్వాదములను సూచించుచున్నది. ఈ వాక్యభాగములోని విశ్వాసము వారు క్రీస్తు నందుంచిన విశ్వాసమని పౌలు భావమై యుండకపోవచ్చును. ఇతర వాక్యభాగములకు వలెనే ఆయన "క్రీస్తు యొక్క విశ్వాసము" అని అర్థమిచ్చు, వస్తుగతమైన సంబంధ సూచక విభక్తిని వాడలేదు. ఆ పదయోగము ప్రకారము, పేర్కొనబడిన విశ్వాసము, దాని వస్తుగతముగా క్రీస్తునందుంచబడిన విశ్వాసమై యుండును. దీనికి బదులుగా, క్రీస్తునందుండిన కొలొస్సయులు వారి విశ్వాసమును సాధకము చేయుచుండిరని ఆయన భావించాడు. ఆయన వారి విశ్వాసము గూర్చి, క్రీస్తునందున్నవారి హృదయములలో ఉనికి కలిగియుండిన విశ్వాసము గూర్చి విన్నాడు. ఈ విషయమునుబట్టియే పౌలు కృతజ్ఞుడై యుండెను (వచనం 3).

### "పరిశుద్ధులందరి మీద మీకున్న ప్రేమను గూర్చియు" (1:4)

పౌలు కొలొస్సయుల విశ్వాసమును మొదట పేర్కొన్నాడు, ఆ తరువాత వారి ప్రేమను పేర్కొన్నాడు. క్రైస్తవ సద్గుణములన్నియు నిర్మింపబడుటకు విశ్వాసము సరియైన పునాదియై యున్నది (2పేతురు 1:5–7). యథార్థమైన విశ్వాసము తోటి విశ్వాసులపై ప్రేమను కలిగియుండునట్లు మనలను ప్రేరేపించును. యేసును వెంబడించువారిని ఒకరి నుండి మరొకరిని వేరుచేసి వారిని ఏకాకులను చేయుటకు బదులుగా, మనము ప్రేమపూర్వకముగా తోటి విశ్వాసులకు మనము తోడ్పడునట్లు విశ్వాసము దోహదపడును.

**ప్రేమ** సంకుచితమైనది కాదు; అది **పరిశుద్ధులందరిని** ఆనందముతో ఆవరించును. అది సంఘము లోలోపల తోటి విశ్వాసులను మినహాయించెడు గుంపులను సృష్టించదు. యేసు పరిచయముచేసి ప్రవేశపెట్టిన ప్రేమ ఒకరి జాతిని, జాతీయతను, సామాజిక పరపతిని, లింగబేదమును, మరియు వ్యక్తిత్వమును మించినదై సకల జనులను సంతోషముతో

చేరదీయును. దేవుడు లోకము యెడల కలిగియున్న ప్రేమ (యోహాను 3:16) మానవుల నేపథ్యముల ప్రకారము నెలకొనియుండు ఒకరొకరి ప్రత్యేకతలను పరిగణించదు. దేవుడు ప్రేమమయుడై యున్న హేతువునుబట్టియే (రోమీయులకు 5:7, 8; 1 యోహాను 4:8). మానవులపై ఆయన ప్రేమ కుమ్మరింపబడుచున్నది కానీ ప్రేమింపబడుటకు ఒకరు యోగ్యులా కాదా అను విషయమునుబట్టి కాదు. గనుక క్రైస్తవులు కూడ ఇదే విధముగా ఇతరులను ప్రేమింపవలెను. ఇతరులు ప్రేమింపదగినవారా కాదా అను విషయముతో నిమిత్తము లేకుండానే, మనము వారిని ప్రేమింపబద్ధులమై యున్నాము, ఇటువంటి స్వభావము గల ప్రేమ ద్వారా, మనము నిజ క్రైస్తవులమనియు యేసును యథార్థముగా వెంబడించుచున్నవారమనియు బయలుపర్చుదుము (యోహాను 13:35).

కొలొస్సయులు క్రీస్తునందు కలిగియుండిన ప్రేమను బట్టి ఆయన దేవునికి కృతజ్ఞతాపూర్వక వందనములు చెల్లించుచున్నాడు. క్రైస్తవ సద్గుణములన్నిటిలో అత్యంత గొప్ప అంశము, "ప్రేమ" (*agapē*). ప్రేమ, విశ్వాసము మరియు నిరీక్షణ కంటే శ్రేష్టమైనదై యున్నది (1 కొరింథీయులకు 13:13). ప్రేమనుబట్టియే ఇతరులు యేసును వెంబడించువారిని గుర్తించుదురని ఆయన స్పష్టంగా మనకు తెలియజెప్పాడు. క్రైస్తవ జీవితములో కనబడవలసినది, అన్నిటిని మించి, ప్రేమయని పౌలు మరియు పేతురు రచించారు (కొలొస్సయులకు 3:14; 1 పేతురు 4:8). క్రైస్తవ ఎదుగుదల పట్టికను రచించుచూ, ఒక ఉత్కృష్టమైన సాధింపుగా, పేతురు ప్రేమకు ప్రథమ స్థానాన్ని ఇచ్చాడు (2 పేతురు 1:7).

"పరిశుద్ధులందరి మీద" అను పదజాలములో, ప్రపంచమందంతటను ఉండిన "పరిశుద్ధులందరిని" కొలొస్సయులు ఎరిగియుండిరి గనుక వారిని ప్రేమించారని పౌలు ధ్వనించలేదు. కొలొస్సయిలోని పరిశుద్ధులు మరియు విశ్వాసులై యుండిన సహోదరులు వారు ఎవరి గూర్చి వినియుండిరో లేదా ఎవరిని ఎరిగి యుండిరో ఆ పరిశుద్ధులను "అందరిని" ప్రేమించారని ఆయన భావించియుండవచ్చును. మనము ఇతర క్రైస్తవులను ప్రేమింపక మునుపు మనము వారి గూర్చి పూర్తిగా తెలిసికొనునంత వరకు వేచియుండనవసరము లేదు. మనము తోటి సహోదరులను కలిసిగొనగానే లేదా గూర్చి వినిన వెంటనే వారిని ప్రేమింపవలెను. మనము ఇతరులను ప్రేమించు విధానము దేవుని ప్రేమ నమూనాను అనుసరించుచున్నదై యుండవలెను.

## వారి పరలోక నిరీక్షణ (1:5)

**5పరలోకమందు మీ కొరకు ఉంచబడిన నిరీక్షణనుబట్టి మీ యొద్దకు వచ్చిన సువార్త సత్యమును గూర్చిన బోధ వలన ఆ నిరీక్షణను గూర్చి మీరు ఇంతకు ముందు వింటిరి.**

### "పరలోకమందు మీ కొరకు ఉంచబడిన నిరీక్షణనుబట్టి" (1:5)

పౌలు ఉపయోగించుచున్న "నిరీక్షణనుబట్టి" అను మాటతో వ్యాఖ్యానకర్తలు తర్జనభర్జన పడ్డారు. నిరీక్షణను అది విశ్వాసము మరియు ప్రేమను మూలాధారంగా చేయుచున్నట్లు అగుపించుచున్నది: "విశ్వాసము మరియు ప్రేమకు మన నిరీక్షణ ఒక పరిణామమై

యున్నదని ఆలోచించ వలదని పౌలు వాడుచున్న భాష మనలను వారించుచున్నది, కానీ దీనికి వ్యతిరేకమైనది నిజము."[10]

పౌలు కృతజ్ఞతా వందనములు చెల్లించుటకు నిరీక్షణనే మూలాధారంగా చేయునట్లు వాక్యభామును పునర్వ్యవస్థీకరించుట ఒక సమస్య యగునని వారు పరిగణించిన విషయమును తొలగించుటకు కొందరు ప్రయిత్నించారు. దేవుని వాక్యము ద్వారా "విశ్వాసము" ఏర్పడును (రోమీయులకు 10:17; యోహాను 17:20 చూడుము), మరియు దేవుని ప్రేమకు "ప్రేమ" ఒక ప్రతిస్పందనయై యుండును (1 యోహాను 4:9). ఈ సద్గుణములు నిరీక్షణపైనే ఆధారపడుచున్నవై కూడా ఉండగలవు. కాలిపోవుచున్న కట్టడములో చిక్కుకొనిపోయినవారు, వారిని ప్రేమించువారు వారిని సంరక్షించి కాపాడుదురను నమ్మకముతో, ప్రేమను ఆధారంచేసికొని వారి నిరీక్షణను నిర్మించుకొనవచ్చును. ఇట్టి ఆపద నుండి కాపాడుటకు అగ్నిమాపకదళము యొక్క శక్తిసామర్థ్యలపై నుండు నమ్మకముతో, వారి నిరీక్షణకు విశ్వాసమును కూడా ఆధారంగా చేసికొనవచ్చును. అనగా నిరీక్షణ, ప్రేమ మరియు విశ్వాసముపై ఆధారపడును.

**నిరీక్షణ** (*elpis*), "ఆకాంక్ష" లేక "ఎదురు చూపు" క్రైస్తవ గొప్ప సద్గుణములలో ఒకటై యున్నది. అది వాస్తవముల మీద కాకుండా ఆశల మీద ఆధారపడిన నమ్మకము కాదు, కానీ అది (ఆత్మ) విశ్వాసముతోకూడిన ఆకాంక్షయై యున్నది మరియు విశ్వాసముపై నిర్మితమైన నిండు అభయమై యున్నది (హెబ్రీయులకు 11:1). ఈ విధంగా నిరీక్షణ దేవునియందును యేసు క్రీస్తునందును ఉంచబడిన (అపొస్తలుల కార్యములు 24:14, 15; 1 థెస్సలొనీకయులకు 1:2, 3; 1 తిమోతి 1:1, 2; 1 పేతురు 1:20, 21) విశ్వాసమునకు ఒక ఫలితమై యున్నది (గలతీయులకు 5:5). లేఖనములలో లిఖితమైయున్న వాక్యములోను సువార్తలలో బయలుపర్చబడిన సత్యములలో సహితము విశ్వాసముంచబడును (రోమీయులకు 15:4; కొలొస్సయులుకు 1:23). యేసు పునరుత్థానం నిరీక్షణను మనకు కలుగజేయును (అపొస్తలుల కార్యములు 23:6; 1 పేతురు 1:3, 4). క్రైస్తవులందరికిని గల నీరీక్షణ ఒక్కటే – రక్షణ సంబంధమైన ఒకే ఒక నిరీక్షణ, అది నిత్యజీవము నిచ్చునదై యున్నది (కొలొస్సయులకు 1:5; 1 థెస్సలొనీకయులకు 5:8; తీతు 1:2; 3:6, 7). అయోగ్యమైన అర్హతను సమకూర్చు దేవుని కృప నిరీక్షణ కలుగజేయును (2 థెస్సలొనీకయులకు 2:16, 17; 1 పేతురు 1:13), గనుక ఈ నిరీక్షణ ప్రజలు రక్షణ పొందుకొని పవిత్రమైన జీవితములు జీవించునట్లు వారిని ప్రోత్సాహించును (రోమీయులకు 8:24; 1 యోహాను 3:3). ఈ నిరీక్షణ క్రైస్తవులు ఆనందించుటకు (రోమీయులకు 5:2; 12:12) అభయమిచ్చును (హెబ్రీయులకు 6:11–17). ఇటువంటి నిరీక్షణతో, ఒకడు యేసుక్రీస్తునందుంచుచున్న విశ్వాసము విషయములో సిగ్గుపడడు (రోమీయులకు 1:16). అదే ఆత్మకు బలమైన లంగరై యున్నది (హెబ్రీయులకు 6:18, 19).

ఏదైన ఒక విషయము గూర్చి నిరీక్షణ కలిగియుండుటకు అవకాశము లేనప్పుడు, దానిని పొందుకొనుటకు అతి తరుచుగా ప్రయాసపడము. ఏదిఏమైనా దానంతట అదే, నిరీక్షణ విలువలేనిదౌతుంది; నిరీక్షణతో పాటు "ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసము" ఉండువలెను (గలతీయులకు 5:6). నిరీక్షణ దానంతట అదే, నిరీక్షణ విలువలేనిదౌతుంది; నిరీక్షణ, విశ్వాసము మరియు ప్రేమపై ఆధారపడి నిర్మించుకొనబడినదై, దేవుని కృపలో దాని

పునాదిని కలిగియుండును (1పేతురు 1:13). నిరీక్షణ నిర్మింపబడు కృప లోనికి కావలసిన ప్రవేశమును, విశ్వాసము సుగమము చేయును.

క్రైస్తవులమైన మనము, మనకు లేని దానిని మరియు మనము యింకను పొందుకొనని దానిని పొందుకొందుమను నిరీక్షణ కలిగియున్నాము. మనము దానిని ఇదివరకే పొందుకొనియున్నట్లయితే, దాని కొరకు యిక మనము ఏమాత్రమును ఎదురుచూడము (రోమీయులకు 8:24). నిరీక్షణ దేవుని లక్షణము కాదు ఎలయనగా గతము గూర్చి మానవాళి ఎరిగియున్న అదే నిశ్చయతతో భవిష్యత్తు గూర్చి ఆయన ఎరిగియున్నాడు. పరలోకమును గూర్చిన నిరీక్షణ, క్రైస్తవులు ఇచ్చట సమృద్ధియైన జీవితమును అనుభవించుట మాత్రమే గాక (యోహాను 10:10), వారు యేసు కొరకు జీవించుటకు కూడ వారికి ప్రోత్సాహకమును కలుగజేయు శక్తియై యున్నది. ప్రస్తుత జీవితము క్రీస్తును సేవించువారు ఎదురుచూడగల మహిమాన్వితమైన జీవితము యొక్క పూర్వానుభూతియై యున్నది. ప్రస్తుత ఆశీర్వాదములు మనము నిరీక్షణ కలిగియున్న ఆనందానుభూతి చెందదగు భవిష్యత్తుకు ప్రారంభమై యున్నవి.

క్రైస్తవులు పరలోకమందు **ఉంచబడిన ఒక నిరీక్షణ కలిగియున్నారు**. "ఉంచబడిన" (*apokeimai*) అనగా "విడిచిపెట్టబడిన" లేక "భవిష్యత్తు కోసం జాగ్రత్తపరచబడిన" (లూకా 19:20, 21), "భద్రపరచబడిన," లేక "నిలువ ఉంచబడిన" అని అర్థము. ఇదే గ్రీకు పదము 2 తిమోతి 4:8లోను హెబ్రీయులకు 9:27లోను అగుపిస్తుంది, అచ్చట ఈ మాట "నియమింపబడిన" అని అనువదింపబడినది. క్రీస్తుకు చెందినవారికి పరలోకమందు నియమింపబడిన ఒక చోటున్నది. ఇటువంటి అభయము క్రైస్తవులకు పరలోక నిరీక్షణను కలుగజేయుచున్నది. "మన పౌరస్థితి పరలోకమందున్నది" అని పౌలు వ్రాయుచున్నాడు (ఫిలిప్పీయులకు 3:20). క్రైస్తవులు పరలోక పౌరులైయున్నారు. అనగా, మనము ఇహలోకమందు పరదేశములమై యున్నాము, మన చుట్టూర నున్న స్వస్థలవాసుల వలె గాక మన స్వదేశము నుండి వేరుపరచబడి యున్నామని దీని అర్థము (1 పేతురు 2:11).

*Ouranoi* అను గ్రీకు పదము (అక్షరాలా, అది బహువచనమై యుండి "పరలోకములు," అని అర్థమిచ్చుచు) క్రొత్తనిబంధనలో తరుచుగా అగుపించును మరియు సామాన్యంగా "పరలోకము" అని అర్థమిచ్చును. పరలోకము గూర్చి కొలొస్సయులు కలిగియున్న నిరీక్షణను వారికి పరిచయము చేసినది పౌలు కాదు. వారు అదివరకే సువార్త వినియున్నారు గనుక పరలోకముగూర్చిన నిరీక్షణను అభివృద్ధి చేసికొన్నారు, బహుశా ఎపఫ్రా చేసిన బోధలు ఇందుకు ఎక్కువ దోహదపడియుండును.

"పరలోకము" అను పదము బైబిలులో ముప్విధ కోణాల్లో వాడబడినది. మొదటి 'పరలోకము' భూమినావరించి యున్న వాతావరణము – ఈ ప్రదేశములో మేఘములు తేలియాడుచుండును, పొగ పైకి లేచుచుండును, మరియు విమానములు మరియు పక్షులు ఎగురుచుండును (మత్తయి 6:26; 8:20). రెండవ "పరలోకము" నక్షత్రములు మరియు పాలపుంతల పరిధిలో నున్న ప్రదేశమై యున్నది (మత్తయి 24:29). మూడవ "పరలోకము" దేవడు మరియు ఆయన దూతల సైన్య సమూహము నివాసముండు చోటైయున్నది (మత్తయి 6:9; 18:10).

యేసుతో కూడ ఉండవలెననునది క్రైస్తవుల నిరీక్షణయై యున్నది (యోహాను 14:3).

ఇది మూడవ 'పరలోకము'లో 2 కొరింథీయులకు 12:2లో పేర్కొనబడిన చోట జరుగునని స్పష్టముగా తెలియుచున్నది. "పరలోకము" ఆధ్యాత్మికమైన స్థలమై యున్నది గనుక అచ్చటికి రక్తమాంసములు ప్రవేశింపనేరవు; అచ్చటికి వెళ్లువారు మార్పునొందినవారై యుందురు (1 కొరింథీయులకు 15:50-53). పరలోకమందున్నవారు ఆధ్యాత్మిక శరీరములు కలిగియుందురు (1 కొరింథీయులకు 15:44), వారు క్రీస్తువలె (ఫిలిప్పీయులకు 3:21) మరియు దేవుని పోలి యుందురు (1 యోహాను 3:2). దేవుడు ఆత్మయై యున్నాడు (యోహాను 4:24), గనుక ఆత్మస్వరూపులకు రక్తమాంసములు మరియు యెముకలును ఉండవు (లూకా 24:39).

ఆధ్యాత్మిక, పరలోకసంబంధమైన ప్రదేశము, కంటికి కనబడుచు నిత్యమైనదికానిదైయున్న భౌతిక ప్రపంచము అగుపించినట్లుగాక, అది కంటికి అగోచరము (2 కొరింథీయులకు 4:18). దాని ఆధ్యాత్మిక స్వభావమునుబట్టి, పరలోకసంబంధమైన ప్రపంచము భౌతిక వస్తువులు లేక పదార్థము చేత వర్ణింపబడజాలదు, కానీ అది భౌతికమైన విషయముతో కేవలము పోల్చబడవచ్చును. దేవునితో కూడ పరలోకమందున్నవారు ఎల్లప్పుడు సంతోషముతో కాలము గడుపుచుందురనునది ప్రాముఖ్యమైన వాస్తవమై యున్నది, ఏలయనగా పరలోకమందు దుఃఖమైనను, ఏడ్పైనను, లేక మరణమైనను ఉండదు (ప్రకటన 21:3, 4). అది "అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన" చోటై యున్నది (1 పేతురు 1:4). కొలొస్సయులు చివరకు చేరుకొనవలెనని ఎదురు చూచుచుండిన ప్రపంచము యిదే, మరియు క్రైస్తవులందరును ఒకనాడు చేరుకొనవలెనని ఎదురుచూడగల స్థలము సయితము యిదే.

కొలొస్సయుల హృదయాల్లో క్రైస్తవ జీవితము గూర్చి ఒక సరైన అవగాహనను కలుగజేయవలెనని పౌలు బహుశా వెదకుచుండియుండవచ్చును. వారి నిరీక్షణ ఇహలోక ఆశీర్వాదముల మట్టుకే నిర్బంధింపబడి యుండలేదు. దానికి బదులుగా, ఈ సహోదరులు లోకములోని అతి శ్రేష్ఠమైనది కలిగియుండిరి: ప్రస్తుతమందు క్రీస్తుతో కూడ ఆనందానుభూతి పొందుకొనుట మరియు తదనంతర జీవితములో పరలోకమందు ఆయనతో కూడా ఉండు నిరీక్షణగలవారై యుండుట.

### "మీ యొద్దకు వచ్చిన సువార్త సత్యమును గూర్చిన బోధవలన మీరు ఇంతకుముందు వింటిరి" (1:5)

"సత్యము" (*alētheia*) నిరాపేక్షమైన నిజమును, సంపూర్తిగా నమ్ముకొనదగిన – అబద్ధము మరియు ఆధారరహితమునకు వ్యతిరేకమైన – సమాచారమును సూచించుచున్నది. **సత్యమును గూర్చిన బోధ** క్రొత్త నిబంధనలో ఒక ముఖ్యమైన భావమై యున్నది. "సత్యము" అను పదమును యేసు ఉపయోగించాడని మత్తయి మరియు మార్కు వ్రాయలేదు, కానీ "ఏలీయా దినములయందు మూడేండ్ల ఆరు నెలలు ఆకాశము మూయబడి దేశమంతటను గొప్ప కరవు సంభవించినప్పుడు, ఇశ్రాయేలులో అనేకమంది విధరాండ్రుండినను, ... మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని పలుకుట ద్వారా యేసు ఆ పదమును ఉపయోగించాడని లూకా ఉల్లేఖించి వ్రాసాడు (లూకా 4:25, 26; వక్కాణింపు అదనంగా చేర్చబడినది). రచయితయైన యోహాను తన తొలిపలుకుల్లో, సత్యమునకు మూలాధారము యేసే అనియు

సత్యమును అభ్యసించువారు వెలుగులోనికి వచ్చెదరనియు పూసగ్రుచ్చినట్లు చెప్పాడు (యోహాను 1:14, 17; 3:21).

సత్యమునకు మూలాధారము యేసే (యోహాను 14:6; ఎఫెసీయులకు 4:20, 21). ధర్మశాస్త్రము వాస్తవము యొక్క ఛాయయై యుండెను (హెబ్రీయులకు 10:1, 2), కానీ అది అసలు విషయము కాదు (కొలొస్సయులకు 2:17). ధర్మశాస్త్రమును మోషే ప్రవేశపెట్టాడు, కానీ యేసు కృపను మరియు సత్యమును ప్రవేశపెట్టి అమలు చేసాడు. సత్యము గూర్చి యేసు సాక్ష్యమిచ్చాడు (యోహాను 18:37, 38), మరియు సత్యము గూర్చి యేసు చేసిన వ్యక్తిగతమైన ఉపదేశముల కొరకు యోహాను వ్రాసిన సువార్తనంతటిని అధ్యయనము చేయుము.

సత్యమును అనుసరించుచు దేవుడు ఆరాధింపబడవలెనను వాస్తవమునుబట్టి సత్యము ఎంత ప్రాముఖ్యమైనదో మనము గ్రహించగలము (వచనం 5బి; యోహాను 4:23, 24). సత్యము ద్వారానే మానవులు వారి పాపము నుండి స్వతంత్రులుగా చేయబడుదురు (యోహాను 8:32), మరియు సత్యము ద్వారానే హృదయములు శుద్ధిచేయబడును (1 పేతురు 1:22). అబద్ధములు దుష్టుని నుండి వచ్చును, ఏలయనగా వానిలో సత్యము లేదు (యోహాను 8:44). పరిశుద్ధాత్మ చేత, సత్యస్వరూపియైన ఆత్మ చేత, బయలుపర్చబడి దేవుని వాక్యములో ఘోషింపబడిన విషయములలో మాత్రమే ఆధ్యాత్మిక సత్యము లభించును. యేసు ఉపదేశముల ననుసరించి వారి జీవితములను కొనసాగించుచుండువారు సత్యమును తెలిసికొనగలుగుదురు. అనేక మంది అబద్ధ బోధకులు లోకములోనికి వచ్చియున్నారు (1 యోహాను 4:1), కానీ దేవుడు ఎవరికైతే తన సత్యమును బయలుపరచాడో వారి మాట ద్వారా క్రైస్తవులు ఈ అబద్ధ బోధకుల ప్రబోధములను పరీక్షించి వివేచింపవచ్చును (1 యోహాను 4:6). దేవుని తీర్పు సత్యము ననుసరించినదై యుండును (రోమీయులకు 2:2; KJV; NKJV; NIV).

వచనం 5బి, 6, 9 మరియు 23లో **వింటిరి** అను మాట పునరుక్తము గావించుచు, వారు దేవుని వాక్య సమాచారమును మౌఖికముగా పొందుకొనుట వలన వారిలో విశ్వాసము మరియు నిరీక్షణ కలిగినవని పౌలు తన పాఠకులకు గుర్తుచేయుచుండెను. వారి విశ్వాసము మరియు నిరీక్షణ వ్రాతమూలకమైన దస్తావేజులపై ఆధారపడలేదు, కానీ వారు వినికిడి వలన తెలిసికొనిన వివరములపై ఆధారపడి యుండెను.

### “సువార్త” (1:5)

**సువార్త** యొక్క సమానార్థ గ్రీకు పదమునకు (*euangelion*) “శుభ సందేశము” అని అర్థము. పౌలు పత్రికలలో ఇదొక ప్రాముఖ్యమైన పదమై యున్నది, దాదాపుగా అరవైసార్లు అగుపిస్తుంది. “సువార్త”లో యేసు మరణము, ఆయన పాతిపెట్టబడుట, మరియు ఆయన పునరుత్థానము కలిసి యున్నవి (1 కొరింథీయులకు 15:1–4). ఏది ఏమైనా, ఆయన మరణము, ఆయన పాతిపెట్టబడుట, మరియు ఆయన పునరుత్థానము గూర్చిన వార్త ఒక వాస్తవముగా ప్రబోధింపబడక మునుపే, సువార్త ప్రకటింపబడినదని యేసు సెలవిచ్చాడు (మత్తయి 11:5). పరలోక రాజ్యం సమీపించియున్నది అనునది  ఆ కాలంలో ప్రకటించి “సువార్తయై” యున్నది మత్తయి 4:17). ఇదే స్థాపించనైయున్న రాజ్యమును గూర్చిను “సువార్త” (మత్తయి 4:23; 9:35; మార్కు 1:14, 15). లూకా *euangelizomai* అను

మాట యొక్క క్రియా వాచక రూపమును ఉపయోగించాడు, "సువార్త ప్రకటించుడి" అని దీని అర్థమై యున్నది (లూకా 4:18; 3:18; 4:43 చూడుము); కానీ ఆయన "సువార్త" అను నామవాచకమును వాడలేదు యోహానైతే ఈ రెండింటిలో దేనినీ వాడలేదు; కానీ "సువార్త" అను పదమును బహుశా "సత్యము" అను పదముతో సమానముగా ఎంచవచ్చును (చూడుము ఎఫెసీయులకు 1:13), దీనిని యోహాను తరుచుగా వాడుచున్నాడు.

వాస్తవమునకు, సువార్త, యేసు మరణము, పాతిపెట్టబడుట, మరియు పునరుత్థానమును మించినదై యున్నది. "వారి యొద్దకు వచ్చిన సువార్త సత్యమును గూర్చిన బోధ వలన" కొలొస్సయుల పరలోకము గూర్చి విన్నారని పౌలు రచించాడు. "సత్యమును గూర్చిన బోధ" గలతీయులలో స్థిరముగా స్థాపింపబడునట్లు పౌలు పేతురును ప్రతిఘటించాడు (గలతీయులకు 2:5, 14). పౌలు, పేతురును వ్యతిరేకించాడు – అనగా యేసు మరణము, పాతిపెట్టబడుట, మరియు పునరుత్థానము విషయంలో పేతురు అనుచితముగా ప్రతిస్పందించుచుండెనని కాదు, కానీ అన్య క్రైస్తవుల సాంగత్యము నుండి ఉపసంహరించుకొన్నాడు గనుకనే వ్యతిరేకించాడు. ఈ విధంగా ప్రవర్తించుట ద్వారా, ఆయన సువార్త సత్యము ననుసరించుచు దాని ప్రకారము నడుచుకొనలేదు. "సువార్త"లో క్రైస్తవులు జీవించవలసిన జీవిత విధానము కూడ కలిసియున్నది (ఫిలిప్పీయులకు 1:27, 28), దానిలో దుష్ప్రవర్తనకు దూరంగా ఉండుట కూడ చేరియున్నది (1 తిమోతి 1:10, 11). యేసు బయలుపరచిన సత్యమంతా సువార్తయై యున్నది.

రక్షణ పొందుకొనుటకు కావలసియున్న తొలి ఆవశ్యకతలు సువార్తలోని ఒక కోణమై యున్నది. సువార్త, "రక్షణ కలుగజేయుటకు దేవుని శక్తియైయున్నదని" యేసు సెలవిచ్చాడు (రోమీయులకు 1:16) గనుక అది సర్వ సృష్టికి ప్రకటింపబడవలసి యున్నది (మార్కు 16:15). విశ్వసించి బాప్తిస్మము పొందుకొనుట ద్వారా సువార్తకు లోబడినవారు రక్షింపబడుదురు (మార్కు 16:16). సువార్తకు లోబడనివారికి యేసు ప్రతిదండన తీర్చి నిత్య శిక్ష విధించును (2 థెస్సలొనీకయులకు 1:7–9).

## వారి విశ్వాసము వలన కలుగుచున్న ఫలితము (1:6)

**6మీ యెద్దకు వచ్చిన ఈ సువార్త సర్వలోకములో ఫలించుచు, వ్యాపించుచున్నట్టుగా మీరు దేవుని కృపను గూర్చి విని సత్యముగా గ్రహించిన నాట నుండి మీలో సయితము ఫలించుచు వ్యాపించుచున్నది.**

### "మీ యొద్దకు వచ్చిన" (1:6)

క్రైస్తవ్యము ప్రాథమికముగా క్రైస్తవులు సువార్తను సర్వ లోకమునకు తీసికొనివెళ్లుట ద్వారా విస్తరించుచున్నది, కానీ యేసు బోధలను నేర్చుకొనుటకు లోకము ముందుకు వచ్చుట ద్వారా కాదు. ఈ విధంగా సత్యము – అనగా, సువార్త – మానవ హేతువాదము ద్వారా పొందుకొనబడజాలదు. అది విశేషంగా, దేవుడు దానిని వెల్లడిపర్చాడు గనుక అది అందరికిని అందుబాటులో ఉన్నది (గలతీయులకు 1:10, 11).

*Eis* ("to" – కి, కు, తో, వద్దకు) అను విభక్తి ప్రత్యయ పదమును ఉపయోగించుచూ,

కొలొస్సయులకు సువార్త వచ్చినదని పౌలు వ్రాసాడు. *Eis* యొక్క మూలమునకు “లో,” “లోనికి” అని అర్థము, ఒక తావు నుండి మరొక తావు వైపునకు, ఒక పరిధి నుండి మరొక పరిధి లోనికి, ఒక దిశ నుండి మరొక దిశగా కదలి వెళ్లుట అని అర్థము. క్రొత్త నిబంధనలో ఎక్కడెక్కడైతే *eis* అను పదము అగుపిస్తుందో అచ్చటెల్లా “వెనుకకు వెళ్లుట” అను పదమునకు బదులుగా, “ముందుకు” అను మాట యొక్క మౌలిక అర్థము, అది క్రియలోనైనా లేక ఆలోచనలలోనైనా, అది అలాగే ఉంచబడినది. ఈ పదమును పౌలు కొలొస్సీ పత్రికలో ఎలా ఉపయోగించాడో కొన్ని ఉదాహరణములు చూద్దాము: “పరిశుద్ధులందరి కొరకు (మీద)” (1:3, 4); “... కనుపర్చునట్లు (కనుపర్చుట కొరకు) (1:9–12); “పాలివారమగుటకు” (పాలివారమగుట కొరకు) (1:9–12); “రాజ్యనివాసులనుగా” (రాజ్యము లోనికి) (1:13); “ఆయననుబట్టి” (ఆయన కొరకు) (1:16); “ఇందుకొరకే” (3:15); “తెలిసికొనునట్లును” (తెలిసికొనుట కొరకు) (4:8, 9).

ఇదే *eis* ను యేసు ఉపయోగించాడు. “ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల (*eis*) కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము” అని ఆయన సెలవిచ్చాడు (మత్తయి 26:28). యేసు రక్తము మున్ముందటి పాపక్షమాపణ కొరకు ముందుకు చూచుచు, ఆ ఉద్దేశము కొరకు, మరియు దానిని సాధ్యము చేయుట కొరకు చిందింపబడినది – అదివరకే క్షమింపబడిన పాపముల కొరకు వెనుకకు చూచుట లేదు. (*Eis* అను పదము) మార్కు 1:4 మరియు లూకా 3:3లోని ఒక సమరూపముగల పదజాలములో కూడ అగుపించుచున్నది, “పాపక్షమాపణ *eis* నిమిత్తము (కొరకు)” (లూకా 24:47; అపొస్తలుల కార్యములు 2:38 కూడ చూడుము). మారుమనస్సు మరియు బాప్తిస్మము, పాపక్షమాపణ కొరకే (*eis*) ఈ ప్రతిస్పందనలు క్షమాపణ పొందుకొనుటకు మరియు పొందుకొను ఉద్దేశముతో ముందు చూపుగలవై యున్నవి; అవి అదివరకే పొందుకొనబడిన క్షమాపణ దిశగా వెనుకకు చూడవు. యేసు రక్తము మారుమనస్సునొంది బాప్తిస్మము పొందినవారికి పాపక్షమాపణను సమకూర్చు మూలాధారమై యున్నది.

ఇదే *eis* ను పౌలు కొలొస్సీ పత్రికలోని అనేక వచనములలో ఉపయోగించాడు: 1:3–4, 6, 9–12, 13, 16, 19, 20; 25, 26; 29; 2:1, 2, 5, 20–22; 3:9, 10, 15; 4:8, 9, 11. ఈ వాక్యభాగములన్నియును ముందుకు చూచుచున్నవే; ఏ ఒక్కటియైనను అదివరకే నెరవేర్చబడిన చర్యవైపు వెనుకకు చూచుటలేదు. కొందరు మత్తయి 12:41ని ఒక మినహాయింపుగా చెప్పుదురు: “నీనెవె యోనా ప్రకటన [యెడల – *eis*] విని మారుమనస్సు పొందిరి.” ఇదొక మినహాయింపై యున్నప్పటికిని, అపొస్తలుల కార్యములు 2:38ని అది ఒక మినహాయింపుగా చేయదు. నీనెవె పట్టణ ప్రజలు యోనా ప్రబోధములను పొందుట “కొరకు” మారుమనస్సు నొందారని చెప్పుటకు బదులుగా వారు యోనా ప్రబోధముల “వలన” మారుమనస్సు నొందారని వాదోపవాదములు చేయబడుచున్నవి. *Eis* ముందుచూపుగలదై యున్నది గనుక, వారి జీవితములు యోనా చేత ప్రబోధింపబడిన ఆధ్యాత్మిక సంస్కరణలలోనికి ప్రవేశించినవనునది ఈ వాక్యభాగము యొక్క అర్థమై యున్నది. ఆధ్యాత్మిక దిశగా వెళ్లుచు, వారు ఆయన ప్రబోధముల *eis* కొరకు మారుమనస్సు నొందనట్లు వారిని వర్ధింపవచ్చునని యోనా తన ప్రబోధములలో వారికి సూచించాడు.

**“సర్వలోకములో” (1:6)**

సువార్త కేవలము కొలొస్సయుల కొరకు మాత్రమే కాదు, కానీ అది **సర్వలోకము** (*kosmos*) కొరకు ఉద్దేశింపబడినదై యున్నది. అది ప్రపంచమందు ప్రతి చోట నున్న సమస్త ప్రజలకు ఒకే సందేశమై యున్నది. సువార్త ప్రకటింపబడుట ద్వారా లోకమును రక్షింపవలెననునది దేవుని ప్రణాళికయై యున్నది (మార్కు 16:15, 16; రోమీయులకు 1:16; 1 కొరింథీయులకు 1:21; 1 పేతురు 1:10-12). ఆయనకు మరొక ప్రణాళిక లేదు. ఎవరో ఒకరు సువార్తను వారి యొద్దకు తీసికొనివెళ్లితే తప్ప, లోకము సువార్త విననేరదు మరియు దానిని తెలిసికొనజాలదు (రోమీయులకు 10:14-17).

“సర్వలోకము” అను పదజాలములో పౌలు “సర్వ” అను పదమును వాడుచున్నాడంటే, పుడమిపై నున్న ప్రతి స్థలము అని దానర్థమై యుండనవసరములేదు. రోమా సామ్రాజ్యములోని ప్రతి స్థలము అని సూచించుచూ పౌలు “సర్వ” అను పదమును వాడాడు (రోమీయులకు 1:8 చూడుము). లూకా 2:1లో, ఇదే ఆలోచనతో లూకా “సర్వ” అను పదమును వాడాడు: “ఆ దినములలో సర్వలోకమునకు ప్రజాసంఖ్య వ్రాయవలెనని,కైసరు ఔగుస్తువలన ఆజ్ఞ ఆయెను.” (కొన్ని NASB ప్రతులు “రోమా సామ్రాజ్యము” అని అర్థమిచ్చునట్లు “భూమియందంతట నివసించుచున్న” అని వాటి అధస్సూచికలు సరియైన రీతిలో తెలియజేయుచున్నవి.)

పౌలు మాత్రమే గాక, అనేక మంది ప్రబోధకుల చేత సర్వలోకములోని సర్వ సృష్టికి సువార్త ప్రకటింపబడుచుండినది. అపొస్తలుల కార్యముల గ్రంథమును చదువువారి మనస్సుల్లో, ఇశ్రాయేలు దేశమునకు వెలుపల ప్రేషితోద్యమ పనులలో నిమగ్నమై యుండినది పౌలు ఒక్కడే అను అభిప్రాయమేర్పడవచ్చును. గ్రంథకర్తయైన లూకా “అపొస్తలుల కార్యములు” యొక్క తరువాత భాగమును పౌలు యొక్క మిషనెరీ పనులను వివరించుటకు పరిమితం చేసాడు, కానీ అన్యజనులుండిన ప్రదేశములలో పౌలు మాత్రమే సువార్త ప్రకటించాడను భావమును ఇది తెలియజేయదు. ఇతర సువార్తీకులు ప్రపంచములోని పలు ప్రాంతములకు సువర్తమానమును చేరవేయుచుండిరి (అపొస్తలుల కార్యములు 11:19). ప్రపంచమంతటను సువార్త ప్రకటింపబడినదని పౌలు చేసిన ప్రకటన, రోమా సామ్రాజ్యమందంతటను సువార్త ప్రకటించుటలో ఆయన మాత్రమే గాక ఇతరులనేకులు కూడా లగ్నమైయుండిరని సూచించుచున్నది.

**“ఈ సువార్త సర్వలోకములో ఫలించుచు, వ్యాపించుచున్నట్టుగా ... మీలో సయితము ఫలించుచు వ్యాపించుచున్నది” (1:6)**

సువార్తను ప్రకటించుచు తదనుగుణంగా జీవించుట వలన వచ్చిన ఫలితమే, **ఫలించుచు వ్యాపించుట** యై యున్నది. ఇచ్చట వాడబడిన గ్రీకు భాషా వాక్రూప క్రియా పదము, *karpophoroumenon* (“ఫలించుట” అని అర్థము) “స్వతస్సిద్ధమైన సత్తువ”ను సూచించుచున్నది.[11] వర్ణనాత్మకమైన ఈ పదము సువార్త వలన కలుగు విస్ఫోటకమైన ఉత్పాదక బలమును సూచించుచున్నది. “రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నదని” పౌలు సువార్త గూర్చి వర్ణించాడు (రోమీయులకు 1:16).

విత్తువాని గూర్చిన ఉపమానములో యేసు చెప్పిన వివరణ ప్రకారము ఉత్పాదకమునకు వాక్యము మూలాధారమై యున్నది. ఒక పొలములో విత్తబడిన విత్తనము గూర్చి యేసు ఈ

ఉపమానములో తెలియజెప్పాడు. "విత్తనము దేవుని వాక్యము" (లూకా 8:11), రాజ్యమును గూర్చిన వాక్యము" (మత్తయి 13:19) అని యేసు వివరించాడు. ఫలము ఫలించవలెనంటే, విత్తనము విత్తబడవలసినదే. "నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి" అని యేసు సెలవిచ్చాడు (యోహాను 6:63). విత్తనము, సత్యమును గూర్చిన వాక్యము, ద్వారా అత్మలుశుద్ధీకరింపబడి పునఃజన్మించును (1 పేతురు 1:22, 23), నూతన జీవమును ఉత్పత్తిజేయును.

భౌతిక విత్తనము యొక్క ఉత్పాదనకు దాని పరిమితులు దానికున్నవి, అలాగే ఆధ్యాత్మిక విత్తనమునకు కూడ అధ్యాత్మిక విత్తనము నిరంతరము ఉత్పాదకమైనదై యుండవలెనంటే, కొన్ని ఫలదాయక పరిస్థితులుండవలెను: (1) విత్తనములో జీవముండవలెను. (2) ఏదో ఒకటి లేదా ఎవరో ఒకరు విత్తనమును నాటవలెను. (3) అది మంచి నేలలో విత్తబడవలెను. (4) అది సాగుచేయబడలెను. (5) విత్తబడిన విత్తనము నుండి మొలకెత్తు మొక్క మరి ఎక్కువ విత్తనములను ఉత్పత్తి చేయవలెను. ప్రపంచమందంతటను యేసు రాజ్యము వ్యాపించుటకు అనువైన విధానము ఇదే. దేవుని వాక్యమునకు లోబడువారు, అదే వాక్యమును ఇతరులతో పంచుకొనుట ద్వారా ఫలించుదురు. తండ్రి, యేసు, మరియు పరిశుద్ధాత్మ మనకు విత్తనమును సమకూర్చియున్నారు, కానీ వారు దానిని విత్తరు. విత్తనమును నాటి ఆ తరువాత దానికి నీరు పెట్టుచూ (1 కొరింథీయులకు 3:6), విత్తనము విత్తుచూ, పంట కోయవలసిన బాధ్యత (యోహాను 4:35-38) యేసు అనుచరులకు అప్పగింపబడి యున్నది. "మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" అని వ్రాసినప్పుడు పౌలు ఈ ప్రత్యేకార్హత మరియు బాధ్యతను ప్రస్తావించుచుండెను (2 కొరింథీయులకు 4:7).

మొదటి శాతాబ్దము నాటి క్రైస్తవులు వాక్యమును వారు వెళ్లిన ప్రతి చోటికి వారితో కూడ తీసికొని వెళ్లారు. ఇందునుబట్టియే, ప్రజలు అనుదినము ప్రభువు నంగీకరించుచుండిరి, తత్ఫలితంగా సంఘము హెచ్చుగుచూ వేగముగా ఎదుగుచుండెను. ప్రజలు వారికి ప్రబోధింపబడిన "సత్య వాక్యమును అనగా, సువార్తను" విని దానిని అంగీకరించినప్పుడు సంఖ్యాసంబంధమైన ఎదుగుదల ఏర్పడినది (ఎఫెసీయులకు 1:13).[12] సంఘములు వెవ్వేరు పద్ధతులను అనుసరించుట ద్వారా ఎదుగుటకు ప్రయాసపడవచ్చును, కానీ సంఘములు వాక్యము ప్రకటింపబడుట ద్వారా ఎదుగవలెననునది దేవుని ప్రణాళికయై యున్నది (అపొస్తలుల కార్యములు 8:4, 25; 18:11; 2తిమోతి 4:2). ఆది సంఘము దేవుని వాక్యమును ఎడతెరపిలేకుండా ఇతరులతో పంచుకొనుచుండెను గనుక "స్థిరముగా ఫలించుచు వర్థిల్లుచుండెను." కార్సన్ ఇలా వ్రాయుచున్నాడు,

> సువార్త ఒకరి అంతరంగ లోతుల్లో మాత్రమే పనిచేయదు కానీ అది దాని ప్రభావమును అంతకంతకు స్థిరంగా అధికంచేస్తుంది. దైవకృతమైన దీర్ఘదృష్టిలో ఈ రెండును ముడిపడియున్నవి. అది సాధారణంగా ఒకరిలో అగుపించదు దాని సఫలీకృతమునుబట్టి అతని ద్వారా ఇతరులను చేరుతుంది; గనుక పరిశుద్ధత యొక్క లోతు ఇతరుల జీవితములపై నుండి సువార్త ప్రభావములో అగుపించు ఎదుగుదలకు సరిసమానమైనదై యుండును.[13]

పేర్కొనబడిన "ఫలము" రెండు విధములుగా ఉండవచ్చును, సంఖ్యావాచకమైనది మరియు అధ్యాత్మికమైనది. సంఖ్యావాచకమైన ఫలము క్రీస్తు నొద్దకు నడిపింపబడిన

ప్రజలను సూచించును (యోహాను 4:34-36; 12:24; 15:8, 16; రోమీయులకు 1:13; ఫిలిప్పీయులకు 1:22). ఆధ్యాత్మిక ఫలము (లేక "ఆత్మ ఫలములు"; గలతీయులకు 5:22, 23) ఒకడు అనుసరించుటకు ఆదర్శవంతముగా యేసు ఆయన జీవితములో ప్రదర్శించిన దైవభక్తిపరాయణ లక్షణముల అభివృద్ధిని సూచించుచున్నది. ఈ రెండు ఒకదానితో మరొకటి అన్యోన్య సంబంధము కలిగియున్నవి. క్రీస్తు నొద్దకు తీసికొనిరాబడినవారు యేసులో అగుపించు అత్యావశ్యకమైన లక్షణములను అభివృద్ధిచేసికొనుటకు ప్రయాసపడవలెను. అప్పుడు మనము క్రీస్తును పోలినవారమై యుందుము మరియు మన చుట్టూర ఉన్న వారిపై ప్రభావము చూపగలము.

ఫలించునదేదైనను అది దానిదాని ఫలమును ఉత్పత్తిచేయును (ఆదికాండము 1:11, 12). ఈ నియమము భౌతికము మరియు ఆధ్యాత్మిక ప్రపంచములో సహితము వాస్తవమై యున్నది. దేవుని వాక్యము యొక్క ఫలము దేవుని రాజ్యమై (మత్తయి 13:19; లూకా 8:11), సంఘమై యున్నది. ఆయన వాక్యమును విత్తుట ద్వారా, క్రైస్తవులు, అనగా క్రీస్తు సంఘ సభ్యులు మాత్రమే ఉత్పత్తియగుదురు. సత్యము యొక్క ఫలము సత్యమును పరస్పరము విరుద్ధమైన దేనినైనను ఫలించదు. దేవుని వాక్యము క్రైస్తవత్వము యొక్క వెవ్వేరైన అనేక రూపురేఖలను ఫలించదు. సువార్త స్వాధికారముతో కోరుచుండు విషయములకు అనుగుణముగా నుండుటయే సువార్త ఫలమై యున్నది, అది బోధనలు మరియు జీవితశైలి యొక్క నిర్మలత్వము ద్వారా అభివ్యక్తము చేయబడును. అంటిపెట్టుకొని అనుసరించుచుండువారిలో ఏర్పడు ఐకమత్యము స్వచ్ఛమైన సిద్ధాంతము ప్రకారము జీవించుటవలన కలుగు ఫలితమై యున్నది (1 కొరింథీయులకు 12:13; ఎఫెసీయులకు 4:4-6).

ఆయనలో నిలిచియుండు ప్రతి తీగె ఫలించునని ద్రాక్షావల్లి మరియు తీగెల గూర్చిన ఉపమానము ద్వారా, యేసు బోధించాడు. ఏదైన ఒక తీగె ఫలించనట్లయితే, అది నరికివేయబడి అగ్నిలో పారవేయబడును (యోహాను 15:1-6). బహుగా ఫలించు తీగెలు దేవునికి మహిమ కలుగజేయును (యోహాను 15:8).

ఇతర సంఘములు ఫలించుచు హెచ్చుగుచుండుట మాత్రమే కాదు, కానీ కొలొస్సయిలోని క్రీస్తు శిష్యుల విషయములో సహితము ఇదే జరుగుచుండినది, **మీలో సహితము ఫలించుచు వ్యాపించుచున్నది** అను మాటల్లో అది వ్యక్తము చేయబడినది. వారు సువార్త సత్యమును పంచుకొనుచుండిరి మరియు అందుకు సముచితమైన ఫలితమును పంటను కోయుచుండిరి. నశించుచున్నవారికి సంఘ సభ్యులు యేసు వాక్యమును బోధించినట్లయితేనే సంఘ సమాజములు ఎదుగగలవు. విత్తనము విత్తబడిన చోట మాత్రమే కోత కొరకు ఎదురుచూడవచ్చును. ఖాళీ పొలములో విత్తనము విత్తబడని చోట, కలుపు మొక్కలు మొలుచును, కానీ మంచి ధాన్యము పండదు.

### "మీరు దేవుని కృపను గూర్చి విని సత్యముగా గ్రహించిన నాటనుండి" (1:6)

కొలొస్సయిలో వాక్యమును విత్తనము విత్తబడినది. వారు [కొలొస్సయుల] **దేవుని కృప** [సువార్తను] గూర్చి విని సత్యముగా గ్రహించినప్పటి నుంచి వాక్యము ఫలించుచుండినదని పౌలు చెప్పుచున్నాడు.

సువార్త అనగా ఏమిటో ఈ సహోదరులు అర్థంచేసికొనననంత వరకు సువార్తను

పంచుకొనుటకు మొదలుపెట్టలేదు. వారు దేవుని కృపను గూర్చిన సువార్తను వారి క్రైస్తవ జీవితములో అతి వేగిరమే అవగాహన చేసికొన్నారనునది దాని అంతర్భవమై యున్నది. క్రైస్తవ జీవితము దేవుని కృపపై ఆధారపడి మొదలౌతుంది, కొనసాగుతుంది, మరియు నిలిచియుంటుంది. "కృప"ను గూర్చిన భావము, "కృప" అను పదమును ఉపయోగించకుండానే పాపక్షమాపణ నిమిత్తమైన సిలువను బోధించుట ద్వారా నేర్పింపబడవచ్చును. రక్షణ, మానవుని యోగ్యతను పరిగణలోనికి తీసికొనకుండానే, క్రీస్తు రక్తము మరియు ఆయన పునరుత్థానము, పాపములను క్షమించుటకు కలిగియున్న శక్తిని గ్రహించుటపై ఆధారపడి యున్నది (రోమీయులకు 3:25, 26; 10:9, 10). దేవుని కృప అంటే, ఇదే.

సువార్తల నివేదికలను గమనించినట్లయితే, యేసు చేసిన బోధలలో ఆయన "కృప" (*charis*) అను పదమును వాడుట గూర్చి లూకా మాత్రమే నివేదించాడు. కృతజ్ఞతను తెలియజేయుటకు ఆయన ఈ పదమును ఉపయోగించాడు (లూకా 6:32–34; 17:9), కానీ దానిని అయోగ్యమైన అర్హతగా ఎన్నడును భావించలేదు. మత్తయి లేక మార్కు వ్రాసిన సువార్తలలో *charis* ను ఎన్నడును భావించలేదు. మత్తయి లేక మార్కు వ్రాసిన సువార్తలలో *charis* కనబడదు, మరియు ఈ పదము యోహాను వ్రాసిన తొలిపలుకుల్లో మాత్రమే కనబడును (యోహాను 1:14, 16, 17).

అపొస్తలుల కార్యములలో లిఖింపబడినట్లుగా సువార్తను ప్రకటించినవారు వారి ప్రసంగములలో *charis*ను ఎన్నడును ఉపయోగించలేదు, కానీ వారు సువార్తను ప్రకటించిన సందర్భములలో ఈ పదము అనేక పర్యాయములు అగుపించును:

- బర్నబా, అంతియొకయలో నున్న క్రైస్తవులను ప్రోత్సాహించుటకు యెరూషలేము సంఘము చేత పంపబడి, ఆయన చేరుకొని అచ్చటి సహోదరులు అంగీకరించిన "దేవుని కృప"ను కళ్లారా చూచినప్పుడు సంతోషించాడు (అపొస్తలుల కార్యములు 11:22, 23).
- వారి మొదటి మిషనెరీ ప్రయాణ సందర్భములో పౌలు మరియు బర్నబా అంతియొకయలో నున్నప్పుడు, అచ్చటి క్రైస్తవులు "దేవుని కృప"లో కొనసాగుచుండవలెనని వారి మనస్సు నొచ్చకుండా వారిని మందలించారు (అపొస్తలుల కార్యములు 13:43). ఈకొనియలో దేవుడు సూచకక్రియలును మరియు అద్భుతములును వారిచేత చేయబడునట్లు "తన కృపావాక్యమునకు" సాక్ష్యమిచ్చుచుండెను (అపొస్తలుల కార్యములు 14:13). అంతియొకయలోని సంఘము చేత వారు "దేవుని కృప"కు అప్పగింపబడిరి (అపొస్తలుల కార్యములు 14:26).
- "ప్రభువైన యేసు కృప" ద్వారా యూదులు రక్షింపబడినట్లుగానే, అన్యజనులు సహితము రక్షింపబడుచుండిరని పేతురు ప్రకటించాడు (అపొస్తలుల కార్యములు 15:11).
- రెండవ మిషనెరీ ప్రయాణముపై పౌలు మరియు సీల పంపబడినప్పుడు, సహోదరులు వారిని "ప్రభువు కృప"కు అప్పగించారు (అపొస్తలుల కార్యములు 15:40).
- "కృప" ద్వారా విశ్వసించినవారికి అపొల్లో అత్యధిక సహాయం అందజేసాడు (అపొస్తలుల కార్యములు 18:27).

- “దేవుని కృపా సువార్తను” గూర్చి సత్యనిష్ఠతో సాక్ష్యమిచ్చుచు ఆయన పరిచర్యను ముగించవలెనని ఆశించుచుండినట్లు పౌలు ఎఫెస్సులోనున్న సంఘ పెద్దలకు తెలియజెప్పి (అపొస్తలుల కార్యములు 20:24) వారిని “ఆయన కృప”కు అప్పగించాడు (అపొస్తలుల కార్యములు 20:32).

అపొస్తలుల కార్యముల గ్రంథములో దస్తావేజుచేయబడిన ఏ ఒక్క ప్రసంగములోనైనను “కృప” అను పదము చేర్చబడనప్పటికిని, వాటి సందేశములలో యేసు ద్వార మరియు యేసు నామములో లభించు క్షమాపణ, రక్షణ, మరియు నీతిమంతులుగా తీర్చబడుట అను విషయములు చేర్చబడి యున్నవి (అపొస్తలుల కార్యములు 3:19; 4:12; 10:43; 13:26, 39; 16:31, 32; 22:16). ఈ విధంగా, “కృప” పేర్కొనబడనప్పటికిని, యేసు ద్వారా ఉచితముగా దేవుడు అనుగ్రహించు క్షమాపణ ప్రకటింపబడినప్పుడెల్లా, అది అమలుచేయబడుచుండినది.

కొలొస్సయులు ఈ కృపను “గ్రహించారు” అని పౌలు చెప్పుచున్నాడు. “గ్రహించారు” (*epiginōskō*) అను పదము “మీద” లేక “గురించి” అని అర్థమిచ్చు *epi* మరియు “తెలిసికొనుట” అని అర్థమిచ్చు *gnosis* అను ఉపసర్గముల మేళనమై యున్నది. ఏదైన ఒక విషయమును మేధాశక్తితో తెలిసికొనుట లేక గ్రహించుటను మించిన భావమును ఈ పదము తెలియజేయుచున్నది. దాని గూర్చిన బోధనలు మరియు అనుభవమునుబట్టి ఒక విషయమును సంపూర్తిగా తెలిసికొనుటయని దీని అర్థము. ఒక మౌలిక భావమునకు సంబంధించిన సంపూర్ణ అవగాహనకు చేరుకొన్న గ్రహింపు గూర్చి పౌలు మాటలాడుచుండెను. క్రొత్త నిబంధనలో, ఈ పదము యొక్క రూపములు సాధారణంగా ఆధ్యాత్మిక అవగాహనకు అన్వయించును (రోమీయులకు 1:28; ఎఫెసీయులకు 1:17-19; 4:11-13; కొలొస్సయులకు 3:9, 10; 1 తిమోతి 2:4). కొలొస్సయులు, క్రీస్తు సందేశమును విని తదనుగుణంగా జీవించుట ద్వారా, సువార్తను గూర్చిన పైపై తెలివిని పట్టుకొనుటకు బదులుగా దాని లోతైన అర్థమును గ్రహించగలిగారు.

సువార్త అర్థంచేసికొనబడగల అంశమై యున్నది. ఇందుకు కొలొస్సయులు ఒక నిదర్శనమై యున్నారు. వారు దాని గూర్చి విన్నారు, విన్నదానిని అర్థంచేసికొన్నారు. అయన వారికి వ్రాసిన విషయములను ఎఫెసీయులు గ్రహించవలెనని పౌలు ఆశించాడు. “మీరు దానిని చదివిన యెడల దానినిబట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించుకొనగలరు” అని ఆయన వారికి వ్రాసాడు (ఎఫెసీయులకు 3:4). “మీరు చదువుకొని పూర్తిగా గ్రహించిన సంగతులు తప్ప మరేమియు మీకు వ్రాయట లేదు, కడవరకు వీటిని ఒప్పుకొందురని నిరీక్షించుచున్నాము” అని ఆయన కొరింథీయులకు ఆభయమిచ్చాడు (2 కొరింథీయులకు 1:13).

వారు “సత్యముగా” గ్రహించారని ప్రకటించుట ద్వారా, వారు దేవుని కృప యొక్క అసలు అర్థమును అర్థంచేసికొని దానిని అనుభవించారని పౌలు భావించాడు. దేవుని కృపను గూర్చిన వారి మేధావి సంబంధ తెలివితో పాటు, వారు ఇప్పుడు వారి జీవితాల్లో దేవుని కృపాశీర్వాదములు పొందుకొన్నారు. “నిజముగా” వారు కేవలము పైపై చూపులకు బదులుగా, కృప యొక్క అసలు అర్థమును గ్రహించారు.

## ఎపఫ్రా నివేదిక (1:7, 8)

**[7]ఎపఫ్రా అను మా ప్రియుడైన తోడి దాసునివలన, మీరు ఈ సంగతులను నేర్చుకొంటిరి. అతడు మా విషయములో నమ్మకమైన క్రీస్తు పరిచారకుడు, [8]అతడు ఆత్మయందలి మీ ప్రేమను మాకు తెలిపినవాడు.**

**"ఎపఫ్రా వలన మీరు ఈ సంగతులను నేర్చుకొంటిరి" (1:7)**

**ఎపఫ్రా** కొలొస్సయులకు ఉపదేశించిన వార్తాహరుడై యుండెను. సత్యమును గూర్చి ఈ సహోదరునికుండిన గ్రహింపు అతనికి పౌలు ఉపదేశించుట ద్వారా కలిగినది లేదా పరిశుద్ధాత్మ అతనికి నేరుగా నేర్పించుట ద్వారా కలిగినది. పౌలు అతని మీద చేతులుంచుట ద్వారా అతనికి పరిశుద్ధాత్మ వరము అబ్బియుండవచ్చును.

ఇతరులందరు **నేర్చుకొనవలసిన** విధముగానే కొలొస్సయులు కూడ సువార్త సత్యమును గూర్చిన బోధను నేర్చుకొన్నారు. ప్రారంభంలో, అది ప్రత్యేకముగా ప్రబోధింపబడుచు ఉపదేశింపబడుట ద్వారా వ్యాపించినది. ఈ సత్యము వ్రాతమూలకంగా సిద్ధంచేయబడిన తరువాత, దానిని చదువుట ద్వారా సహితము నేర్చుకొనుటకు అనుకూలముగా ఉండినది (ఎఫెసీయులకు 3:3–5).

పరిశుద్ధాత్మయైనను, సరికదా దూతలైనను కొలొస్సయులకు ప్రబోధించలేదు (1 పేతురు 1:10–12). అపొస్తలులకును క్రొత్త నిబంధన ప్రవక్తలకును యేసు సత్యమును పరిశుద్ధాత్మ చేత బయలుపర్చాడు (యోహాను 14:26). చివరి రాత్రి/ప్రభు రాత్రి భోజన సమయమందు యేసు ఆయన శిష్యులతో కూడ ఉండినప్పుడు, పరిశుద్ధాత్మ వారికి వర్తించును: "నేను మీయొద్ద ఉండగానే యీ మాటలు మీతో చెప్పితిని" (యోహాను 14:25); "మీరు మొదట నుండి నా యొద్ద ఉన్నవారు గనుక మీరును సాక్ష్యమిత్తురు" (యోహాను 15:27); "నేను మీతో చెప్పవలసినవి ఇంకను అనేక సంగతులు కలవు, గాని యిప్పుడు మీరు వాటని సహింపలేరు" (యోహాను 16:12).

అపొస్తలులు మరియు క్రొత్త నిబంధన ప్రవక్తలు జలాశయముల వలె సత్యమునకు నిక్షేపములుగా ప్రయోజనకరమైనవారైయుండిరి, గనుక ఉపదేశకులు వారి నుండి వారికవసరమైన సమాచారమును సేకరించుకొనుచుండిరి. పౌలు అతనికి నేర్పించిన విషయములను ఇతరులు ఇంకొందరికి నేర్పించగలుగునట్లు అతడు ఇతరులకు బోధింపవలెని పౌలు తిమోతిని మందలించాడు (2 తిమోతి 2:2). అపొస్తలులు మరియు ప్రవక్తలు సంఘము యొక్క పునాది మీద కట్టబడినవారై యుండిరి (ఎఫెసీయులకు 2:20) మరియు వారు దేవుని ఆజ్ఞలు రచించారు (1 కొరింథీయులకు 14:37).

"ఎపఫ్రా" అను నామము ఎపఫ్రాదితు అను నామమునకు లఘు రూపమై యున్నది, ఇది లాటిన్ నామము "వెనస్తు" (అనగా, "సొగసైన" లేక "మహోహరమైన" అని అర్థము) యొక్క అనురూపమైనదై యున్నది. ప్రయాణములలో ఆయనకు తోడుగా నుండుటకు పౌలుకు ఒక సహప్రయాణికుడు ఉండెను, అతని పేరు చాలా పొడవైనది – అతడే పౌలు చేత ఫిలిప్పీ పట్టణమునకు పంపబడిన సహోదరుడు (ఫిలిప్పీయులకు 2:25; 4:18). ఎపఫ్రాదితు మరియు ఎపఫ్రా ఒకటే అని తికమక పడకూడదు, ఏలయనగా ఎపఫ్రా

కొలొస్సీ పట్టణ వాస్తవ్యుడు. కొలొస్సీ పట్టణమునకు సువార్తను మొదట తీసికొని వెళ్లినది బహుశా ఎపఫ్రా అయియుండును. పౌలు కొలొస్సయులకును ఫిలేమోనుకును తన పత్రికలు వ్రాసినప్పుడు ఇతడు పౌలుతో కూడ రోమా పట్టణములో ఉండెను. కొలొస్సీ, లవొదికయ, మరియు హియెరాపొలిలో స్థాపింపబడిన సంఘముల పరిస్థితులను పౌలు ఎపఫ్రా ద్వారా తెలిసికొనుచుండెను. పౌలు ఎఫెస్సు పట్టణములో సౌవార్తీకరణోద్యమమును చేపట్టినప్పుడు ఎపఫ్రా బహుశా పై పట్టణములలో సువార్త ప్రకటించుచుండి యుండవచ్చును (అపొస్తలుల కార్యములు 19:10 చూడుము). ఆయా సంఘముల పరిస్థితులను పౌలుకు తెలియజెప్పి అటుతరువాత చెరసాలలో నుండిన ఆయనతో కూడ ఉండుటకును ఎపఫ్రా రోమా పట్టణమునకు ప్రయాణమై వెళ్లాడని తేటగా తెలియచున్నది.

ఎపఫ్రా క్రీస్తు యెడల కలిగియుండిన అంకితభావమును మరియు చేయుచుండిన సేవను పౌలు అత్యున్నముగా పరిగణించాడు. పౌలు అతనిని "క్రీస్తుయేసునందు నాతోడి ఖైదీయైన" అనియు (ఫిలేమోను వచనం 23), "మా ప్రియుడైన తోడిదాసుడును, … మా విషయములో నమ్మకమైన క్రీస్తు పరిచారకుడు" అనియు (కొలొస్సయులకు 1:7, 8), "క్రీస్తుయేసు దాసుడునైన" అనియు (కొలొస్సయులకు 4:12) సంబోధించుచున్నాడు. పౌలు అనేక పర్యాయములు తనని తాను ప్రస్తావించుకొంటూ, "దాసుడు" అను పదమును ఉపయోగించాడు, కానీ ఇతరుల విషయంలో కేవలము రెండుసార్లు మాత్రమే ఉపయోగించాడు – ఎపఫ్రా (కొలొస్సయులకు 4:12) మరియు తిమోతి (ఫిలిప్పీయులకు 1:1).

### "మా ప్రియుడైన తోడిదాసుడు" (1:7)

పౌలు ఎపఫ్రా యెడల కనుపర్చిన ప్రత్యేకమైన అదే ప్రేమను, క్రైస్తవులు మరియు ఆయనతో కూడ పరిచర్య చేసిన ఇతరుల యెడల కూడ కనుపర్చాడు. పౌలు తనతో కూడ పరిచర్యచేయుచుండిన వారిని ప్రస్తావించినప్పుడు తరుచుగా ప్రియమైన/ప్రియుడైన (*agapētos*) అను పదమును ఉపయోగించాడు: ఎపైనెటు (రోమీయులకు 16:5), అంప్లీయతు (రోమీయులకు 16:8), స్తాకు (రోమీయులకు 16:9), పెర్సిసు (రోమీయులకు 16:12), తిమోతి (1 కొరింథీయులకు 4:17; 2 తిమోతి 1:2), తుకికు (కొలొస్సయులకు 4:7; ఎఫెసీయులకు 6:21), ఒనేసిము (కొలొస్సయులకు 4:8, 9), లూకా (కొలస్సయులకు 4:14) మరియు ఫిలేమోను (ఫిలేమోను వచనం 1). ఆయా సంఘ సమాజములకు వ్రాయుచూ, "ప్రియులైన" అని ఆయన వారిని తరుచుగా పిలిచాడు. పౌలు రోమా పట్టణములో లేకుండినప్పటికిని, రోమాలోని సంఘమును ఆయన "ప్రియులారా" అని సంబోధించాడు (రోమీయులకు 12:19). రోమా వాస్తవ్యులకు వ్యక్తిగత అభివందములను పంపినప్పుడు, ఆ సంఘ సభ్యులను ఆయన ఎరిగియుండెనని సూటిగా సూచించాడు. అయితే కొలస్సీలో నున్న సంఘ సభ్యులను సంబోధించినప్పుడు ఆయన "ప్రియులారా" అను పదమును ఉపయోగించలేదు, ఆయన వారిలో అనేకులను వ్యక్తిగతముగా కలిసికొనకపోవుట బహుశా ఇందుకు ఒక కారణమై యుండవచ్చును.

పౌలు మాటల్లో, ఎపఫ్రా **ఒక దాసుడై** (*sundoulos*) యుండెను, ఈ పదము *sun,* "తో" మరియు *doulos,* "బానిస" అను రెండు మాటల మేళనమై యున్నది. అతడు, తనను తానే యేసు బానిసగా – తనకు చెందడు, కానీ యేసుకే చెందినవాడుగా – ఎంచుకొనిన పౌలుతో

కూడ పనిచేసాడు. ఈ విషయము ఆయన గూర్చి నిజమైనదై యున్నట్లుగానే వారి విషయములో కూడ నిజమైనదై యున్నదని ఆయన కొరింథీయులకు గుర్తుచేసాడు (1 కొరింథీయులకు 6:19). క్రీస్తు యొక్క సంఘ సభ్యులుగా, వారు ఆయన రక్తముతో కొనబడినవారై యుండిరి (అపొస్తలుల కార్యములు 20:28). ఎపఫ్రాను యేసు దాసునిగా మాత్రమే పౌలు ఎంచలేదు కానీ ఆయనతో కూడ యేసును సేవించుచుండిన ఒక తోడిదాసునిగా కూడ ఎంచాడు.

ఆయన ఉపదేశించిన ఒక ఉపమానములోను (మత్తయి 18:28–33), ఆయన తన రెండవ రాకడ గూర్చి తెలియజెప్పినప్పుడును (మత్తయు 24:44) యేసు తోటి దాసుల గూర్చి మతమునకు సంబంధము లేని భావముతో పేర్కొన్నాడు. పౌలు పత్రికలలో ఈ అభివ్యక్తము అగుపించు ఒకే ఒక మరొక సందర్భము, తుకికు విషయంలో వర్తించుచున్నది.

### "అతడు మా విషయములో నమ్మకమైన క్రీస్తు పరిచారకుడు" (1:7)

ఎపఫ్రా **నమ్మకమైన పరిచారకుడై** యున్నాడని పౌలు అతని గూర్చి వర్ణించాడు. "నమ్మకమైన" (*pistos*) అను పదము సామాన్యంగా అది ప్రజలకైనా (మత్తయి 24:45; 25:21; లూకా 12:42) లేక దేవునికైనా (1కొరింథీయులకు 1:9) సేవచేయుటలో స్థిరంగా నుండువానిని వర్ణించును. ఒక వ్యక్తి యెడల నమ్మకముగా నుండు సందర్భములో వాడబడినప్పుడు దీని అర్థము, అంకితభావముతో కూడిన పరిచర్య చేయుటయై యున్నది. "... అను వాక్యము నమ్మదగినది" (1తిమోతి 1:15; 3:1) అన్నట్లుగా, "ఆధారపడదగినది" అను అర్థమును కూడ చెప్పుకొనవచ్చును. కొన్ని సంధర్భములలో, దేవుని యెడల నమ్మకముగా నుండుట గూర్చి ప్రస్తావించినప్పుడు, ఇట్టి రిఫెరెన్సు క్రైస్తవుడైయున్నవానిని సూచించును (ఉదా॥ 1 తిమోతి 1:12, 13 చూడుము).

వచనం 7బిలోని, "దాసుడు" అనునది "బానిసయైన దాసుడు"కు భిన్నమైనదై యున్నది. ఇక్కడి "దాసుడు" (*diakonos*) అను పదమునకు విధేయతతో లొంగిపోయి వినయముతో ఉపచారము చేయువాడని అర్థము. ఈ పదము, సర్వసామాన్యంగా, ఇతరులకు సేవచేయువారు లేక పరిచర్య చేయువారి గూర్చి ప్రస్తావింపబడు సందర్భములలో వాడబడును (మత్తయి 20:26; 23:11) – ఉదా॥ పరిచారకులు (మత్తయి 22:13; యోహాను 2:5), ప్రభుత్వము (రోమీయులకు 13:3, 4), దేవుని సేవించువారు (2కొరింథీయులకు 6:4), సాతానును సేవించువారు (2కొరింథీయులకు 11:15), మరియు డీకనులుగా పరిచారము చేయువారు (ఫిలిప్పీయులకు 1:2; 1తిమోతి 3:8, 12). పౌలు తనను తాను ప్రస్తావించుకొంటూ ఇదే పదమును ఉపయోగించాడు గనుక (కొలొస్సయులకు 1:23), ఎపఫ్రా ఒక డీకనుగా పరిచారము చేసాడని చెప్పుకొనగల ఎటువంటి తుది అభిప్రాయమైనను ఏర్పడదు. ఇదే అర్థముగల మరొక గ్రీకు పదము *diakonia* ("క్రైస్తవ సంఘ పరిచర్య"యని అనువదింపబడినది), డీకనుల అధికార హోదా విషయంలో ఎన్నడును ఉపయోగింపబడలేదు (అపొస్తలుల కార్యములు 1:17; 6:4; రోమీయులకు 12:6, 7 కూడ చూడుము, అచ్చట ఈ పదము యొక్క వెవ్వేరు రూపములు "పరిచర్య" అనియు "పరిచర్యయందు" అనియు అనువదింపబడినవి).

పౌలు పనులలో ఎపఫ్రా ఆయనకు క్రీస్తు యొక్క ఒక నమ్మకమైన దాసుడుగా చేయూత నిచ్చాడు మరియు సహాయము చేసాడు. పౌలుకు సాయపడుచునే, తాను సువార్త ప్రకటించిన

వారికి కూడ సహాయము చేసాడు.

"అతడు మా విషయములో నమ్మకమైన క్రీస్తు పరిచారకుడు" అను వాక్యములోని **మా** (*hēmōn*) అను మాట యొక్క గ్రీకు పదమునకు భిన్న రూపములున్నవి. అది "మా పక్షముగా" అని కొన్ని అనువాదములలోను (NASB; NIV; NEB; TEV; ASV; RSV), "మీ కొరకు" *humōn* అని ఇతర అనువాదములలోను (KJV; CEV) వ్రాయబడి యున్నది. నాలుగవ అనువాదము, గ్రీకు క్రొత్త నిబంధన యొక్క సవరింపబడిన కూర్చు *humōn* "మీ" అను అర్థమును అభిమానించుచున్నది.[14] అధికార ప్రాబల్యము నిర్ణాయాత్మకమైనది కాదు గనుక, రెండర్థాలను అంగీకరింపవచ్చును. రెండు అనువాదములలో అర్థము మరీ అంత ఎక్కువగా మారదు. *Humōn* సరియైన పఠనమైనట్లయితే, సువార్తను పంచుకొనుటలో ఎపఫ్రా పౌలుకు సహాయం చేసాడు, పౌలు పనుల్లోను మరియు ఆయన సువార్త ప్రకటించిన వారికి ప్రయోజనకరమైనవాడై యున్నాడు. *Hēmōn* సరియైనదైనట్లయితే, ఎపఫ్రా కొలొస్సయులకు క్రీస్తు వార్తాహరుడై యున్నాడని ఆయన సంపూర్తిగా ఆమోదించాడని పౌలు సూచించుచున్నాడు.

**"అతడు ఆత్మయందలి మీ ప్రేమను మాకు తెలిపినవాడు" (1:8)**

కొలొస్సయులు దేవుని కృప గూర్చి ఎపఫ్రా వలన నేర్చుకొన్నారు. ఎపఫ్రా వారికి నేర్పించుట మాత్రమే కాదు, కానీ వారికి సంబంధించిన ఒక మంచి నివేదికను పౌలు యొద్దకు తీసికొని వచ్చాడు. అతడు పౌలు మరియు తిమోతికి నివేదించిన నివేదికలో కొలొస్సయులు ప్రేమలోను ఆధ్యాత్మికముగాను అభివృద్ధిచెందుచుండిన వివరముండినది. కొన్ని వచనములు వ్రాయక మునుపు (1:3, 4), వారు పరిశుద్ధులందరి యెడల కలిగియుండిన ప్రేమనుబట్టి పౌలు వారిని ప్రశంసించాడు. ఇప్పుడు ఆయన సేకరించిన సమాచారమునకు గల మూలాధారమును – ఎపఫ్రా అందజేసిన నివేదికను – వెల్లడించాడు.

పౌలు కొలొస్సయుల **ఆత్మయందలి ప్రేమను** ప్రస్తావించుచున్నాడంటే, అది పరిశుద్ధాత్మయందలి ప్రేమయని అర్థమా? అత్యధిక అనువాదకులు 8వ వచనములోని "ఆత్మ" (*pneuma*) అను ఉపపదము ఉపయోగింపబడిన చోట,[15] అది పౌలు ఆత్మ ప్రస్తావనను సూచించుచున్నట్లున్నది. కొలొస్సీ పత్రికలో *pneuma* అని అర్థమిచ్చు పదము అగుపించునది ఈ రెండు స్థలములలో మాత్రమే. 8వ వచనములో అది పరిశుద్ధాత్మను సూచించినట్లయితే, పౌలు ఈ పత్రికలో పరిశుద్ధాత్మ గూర్చి ప్రస్తావించలేదని అర్థమగును.

పౌలు తన పత్రికలలో పరిశుద్ధాత్మను ప్రస్తావించినప్పుడు, సర్వసాధారణంగా ఆయన "ఆత్మ" అను మాట అర్థాన్ని "పరిశుద్ధ" అను పదముతో విశేషణవంతం చేసాడనియు (రోమీయులకు 5:5; 9:1) లేదా "ఆత్మ" అను మాటకు ముందు ఒక ఉపపదమును ఉపయోగించాడనియు (రోమీయులకు 2:29; 8:26, 27; గలతీయులకు 3:2; 5:22). గ్రీకు గ్రంథపాఠము చూపించును. ఏది ఏమైనా, ఆయన ఉపపదమును ఉపయోగించుటలో ఎల్లప్పుడు స్థిరంగా ఉండలేదు (ఎఫెసీయులకు 3:5 మరియు 4:4 పోల్చి చూడుము). ఈ హేతువునుబట్టియే, ఉపపదము ఉపయోగింపబడని సందర్భములలో అనువాదకులు ఒక అభిప్రాయమును ఏర్పరచుకొనునప్పుడు తగు జాగ్రత్త వహించవలెను. విల్యమ్ హెండ్రిక్సన్ ఈ క్రింది విధంగా గమనికను తెలియజేయుచున్నాడు:

ఇది (8వ వచనములో) పరిశుద్ధాత్మ గూర్చిన ఎటువంటి ప్రస్తాపన లేకుండా సామాన్యంగా "ఆధ్యాత్మిక ప్రేమ" అని అర్థమిచ్చుచున్నదని సలహా చెప్పువారున్నప్పటికిని, రోమీయులకు 15:30; గలతీయులకు 5:22 మరియు ఎఫెసీయులకు 3:16, 17 వంటి వాక్యభాగములలోని క్రీస్తు తన ప్రేమ అంతరంగమందు నివసించు పరిశుద్ధాత్మ ఫలమని నిశ్చయాత్మకముగా ఎంచబడుచున్నదను వాస్తవమునకు ఈ అభిప్రాయము ప్రతికూలమైనదిగా ఉన్నది.[16]

8వ వచనంలో పౌలు నిజముగా పరిశుద్ధాత్మ గూర్చి భావించియున్నట్లయితే, కొలొస్సయులు పరిశుద్ధాత్మ గుణగణములతో సామరస్య సంబంధము కలిగియున్నారని ఆయన పరిగణించాడను అభిప్రాయమును మనము ఏర్పరచుకొనవచ్చును. వారు ఆత్మఫలము కలిగియుండిరి, ఈ ఫలములో ప్రేమ కూడ కలిసియుండినది (ఎఫెసీయులకు 5:9).

గ్రీకు గ్రంథపాఠములో "ఆత్మ"కు ముందు ఏ ఉపపదము అగుపించదు గనుక, పౌలు పరిశుద్ధాత్మకు బదులుగా "ఆత్మ యందు" (మానవ ఆత్మ) యని భావించియుండవచ్చును. ప్రసిద్ధగాంచిన ఆత్యధిక అనువాదకులు "ఆత్మ యందు" అని అనువదించారు. ఇతరులు దానిని "ఆత్మయందలి ప్రేమ"[17] అనియు "మీ ఆధ్యాత్మిక అనురాగము" అనియు అనువదించారు.[18]

పౌలు భావించినది "ఆత్మ(లో/తో)" అని అయియున్నట్లయితే, యేసు "ఆరాధించుట" గూర్చి ప్రస్తావించుచు యోహాను 4:23, 24లో, "ఆత్మ" అని సెలవిచ్చిన పదము యొక్క అదే అర్థము ఇక్కడ కూడ అన్వయించును, మరియు "ఆత్మ(లో/తో)" అని అనేక అనువాదములలో (KJV; NASB; NIV; NKJV; NRSV; RSV) కూడ వ్రాయబడి యున్నది. అలాగైతే, వారి ప్రేమ కేవలము బాహ్య ప్రదర్శన కాదు, కానీ విశేషంగా మానవ అంతరంగములో ఉద్భవించి వెలుపలికి వచ్చు ప్రేమ యని దీని అర్థమై యుండును. ఇది వారి ప్రేమలో గల మన:పూర్వకతను సూచించును.

## అన్వయము

### కృతజ్ఞతాస్తుతులతో కూడిన ప్రార్థన (1:3–6)

అతి తరుచుగా మన ప్రార్థనలు వాటి స్వభావములో స్వార్థముతో కూడినవై యుండును. మనము మన పక్షమున దేవునికి కృతజ్ఞతావందనములు చెల్లించుకొనుచు ఇతరుల పక్షమున మనవి చేయుటకు బదులుగా మనమాశించు ఆశీర్వాదముల కొరకు ఎడతేరపిలేకుండా విన్నపములు చేయుచునే యుందుము. యేసు ప్రార్థనలు ఆయన తన కొరకు చేసినవాటి కంటే ఇతరుల కొరకు చేసినవే ఎక్కువగా ఉన్నవి (లూకా 22:31, 32; యోహాను 17:6–26; లూకా 23:34). ఆయన వారి కొరకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాడని కొలొస్సయులకు పౌలు స్పష్టముగా తెలియజేసాడు.

(1) *ఆయన వారి విశ్వాసము మరియు ప్రేమనుబట్టి కృతజ్ఞుడై యుండెను.* క్రైస్తవ ప్రేమ గ్రుడ్డిది కాదు, కానీ అది నిదర్శనముపై ఆధారపడును. రూపకల్పనల నిదర్శనములు విశ్వవ్యాప్తముగా నున్నవి, గనుక నిర్దిష్ట రూప నిర్ణేత ఉన్నాడని రుజువగుచున్నది (కీర్తనలు 19:1; రోమీయులకు 1:19, 20; హెబ్రీయులకు 3:3, 4). దేవుడు ఉన్నాడను విశ్వాసము

లేకుండా ఒకడు ఆయనను సంతోషపరచలేడు. విశ్వాసము మరియు కృప ద్వారా రక్షణ కలుగును (ఎఫెసీయులకు 2:8, 9), ఏలయనగా విశ్వాసము ద్వారా మనము కృపను, అనగా, మన అర్హతనుబట్టి గాక ఆయన తన ప్రీతినిబట్టి మనకు ఉచితముగా అనుగ్రహించు అనుగ్రహమును దేవుని నుండి పొందుకొందుము (రోమీయులకు 5:1, 2).

రక్షణను కలుగజేయు విశ్వాసము నిశ్చేష్టమైనది కాదు; అది ప్రేమ ద్వారా దాని కార్యమును సాధించును (గలతీయులకు 5:6), ఏలయనగా క్రియలు లేని విశ్వాసము మృతమైనదే (యాకోబు 2:17, 26). విశ్వాసము దేవుని వాక్యము చేత పోషింపబడుచు తద్వారా పెంపొందింపజేయబడును (రోమీయులకు 10:17). మన విశ్వాసమును వృద్ధిపొందించుకొనవలెనంటే, బెరయ క్రైస్తవులు అనుసరించిన పద్ధతి చొప్పున (అపొస్తలుల కార్యములు 17:10, 11) మనము కూడ దేవుని వాక్యమును అనుదినము పరిశోధనాత్మకముగా చదువవలెను. శిశువులు పాలను అపేక్షించు విధంగానే మనము లేఖనములను అపేక్షించవలెను (1 పేతురు 2:2), ఏలయనగా మనము పదార్థ సంబంధమైన ఆహారముతో మాత్రమే జీవించలేము. మనకు దేవుని వాక్యమను ఆధ్యాత్మిక ఆహారము కూడ అవసరమై యున్నది (మత్తయి 4:4).

మన విశ్వాసమునకు క్రైస్తవ సద్గుణములు చేర్చబడవలెను; ఈ సద్గుణముల శిఖరాగ్రము ప్రేమయే (2 పేతురు 1:5–7). అది మనకు చేయు మేలునుబట్టి ప్రేమ అతి గొప్ప గుణ గణమై యున్నది. మనము దేవునికి లోబడునట్లును (యోహాను 14:15, 21, 23), క్రైస్తవ శీలమును అభివృద్ధి చేసికొనునట్లును (1 కొరింథీయులకు 13:4–8), మరియు మన తోటి సహోదరులతోను, మన పొరుగువారితోను, చివరకు మన శత్రువులతో సహా సరియైన సన్నిహిత సంబంధములు కలిగియుండునట్లును అది మనలను ప్రోత్సాహించును.

క్రైస్తవులు దేవుని యెడల (మత్తయి 22:37), తోటి విశ్వాసుల యెడల (యోహాను 13:34), పొరుగువారి యెడల (మత్తయి 22:39), మరియు శత్రువుల యెడల (మత్తయి 5:44) వారి ప్రేమను కనుపర్చవలసినవారై యున్నారు. మనము ప్రభువునందు సహోదరులును సహోదరీమణులునైన వారి యెడల ప్రేమ కలిగియుండుట మనము యేసు అనుచరులమని ఇతరుల యెదుట ప్రదర్శించు మార్గమై యున్నది (యోహాను 13:35). ఈ విధమైన ప్రేమను మనము ఒకరిలో మరొకరము గమనించునప్పుడు మనము కృతజ్ఞులమై యుండవలెను.

(2) *ఆయన వారి నిరీక్షణ కొరకు కృతజ్ఞుడై యుండెను.* నిరీక్షణ ఆత్మకు లంగరైయున్నది (హెబ్రీయులకు 6:19). సముద్రములో ఒక చోట నిలిపియుంచబడిన ఓడ స్థిరముగా నిలిచియుండునట్లు లంగరు దానిని గట్టిగా పట్టుకొని యుంచినట్లే, క్రైస్తవులు యేసు నుండి దూరమగుచు ఐహిక ప్రవాహంలో కొట్టుకొనిపోకుండునట్లు నిరీక్షణ వారిని నిరోధించును. వారు వినిన సందేశమును విడిచిపెట్టి దానికి దూరముగా కొట్టుకొనిపోవుట గూర్చి హెబ్రీ పత్రిక రచయిత పాఠకులను హెచ్చరించాడు (హెబ్రీయులకు 2:1–4).

పరలోకమే క్రైస్తవులందరి నిరీక్షణయై యున్నది. నూతన జన్మము మనకు పరలోక ఆశీర్వాదముల గూర్చిన నిరీక్షణ కలుగజేయును (1 పేతురు 1:3, 4). ఇది దేవుడు తన మహా కనికరమునుబట్టి మనకనుగ్రహించిన ఆశీర్వాదమై, యేసు పునరుత్థానము ద్వారా ప్రదర్శింపబడినది. మనము బాప్తిస్మమందు యేసు మరణము, పాతిపెట్టబడుట, మరియు పునరుత్థానములో పాలిభాగస్థులమైనప్పుడు ఆయన పునరుత్థానము ద్వారా రక్షణ

సమకూర్చబడును (1 పేతురు 3:21).

పునరుత్థానము పిదప పరలోకములో మనమందరమును కలిసియుందుమనునది క్రైస్తవులు కలిగియుండగల నిరీక్షణయై యున్నది. ఆ సమయంలో, మనము క్రీస్తు యొక్క ఆధ్యాత్మిక రూపములోనికి రూపాంతరము చెందినవారమై (ఫిలిప్పీయులకు 3:21; 1 యోహాను 3:2) మార్పునొందుదుమని (1 కొరింథీయులకు 15:51, 52), వాగ్దానము చేయబడినది. ఈ నిరీక్షణ మన జీవితముపై చిరకాలము నిలిచియుండు ప్రభావము కలిగియుండవలెను.

(3) *వారు ఫలించుటనుబట్టి కూడ ఆయన కృతజ్ఞుడై యుండెను.* ఇతరులు రక్షింపబడునట్లు వారికి సహాయము చేయుటకు క్రైస్తవులు రక్షింపబడి యున్నారు. నిత్య జీవము నిమిత్తమై ఆత్మలను సంపాదించునట్లు వారు నశించినవారితో నిండియున్న పొలములను చూడవలెనని యేసు అపొస్తలులతో చెప్పాడు (యోహాను 4:35, 36). కోత విస్తారముగా నున్నది కానీ కోయువారు కొద్దిగా ఉన్నారని ఆయన సెలవిచ్చాడు (మత్తయి 9:37).

మన తోటి క్రైస్తవులు ఆధ్యాత్మికముగా ఎదుగుచూ ఇతరులను క్రీస్తు నొద్దకు నడిపించినప్పుడు మనము ఆనందభరితులమై యుండవలెను. సహోదరుల మధ్య అసూయ తలెత్తకూడదు. ఒక సభ్యుడు ఏదైనా ఒక విషయములో ప్రవీణుడైనప్పుడు, అతని సఫలీకృతమునుబట్టి అందరూ ఆనందించాలి (1 కొరింథీయులకు 12:26).

కొలొస్సీ సంఘములోని కొన్ని సమస్యలు పౌలు దృష్టికి వచ్చాయి. ఆయన వాటి గురించే కాలం గడుపలేదు; దానికి బదులుగా, సహోదరులు కలిగియుండిన ప్రశంసనీయమైన విశ్వాసము, ప్రేమ, నిరీక్షణ మరియు ఫలించుట యను లక్షణములనుబట్టి ఆయన దేవునికి కృతజ్ఞుడై యుండెను.

**ఇతర క్రైస్తవుల కొరకు ప్రార్థించుట (1:3-6)**

దాదాపుగా క్రైస్తవులందరును అప్పుడప్పుడు, మరి ముఖ్యముగా ఇతరుల కొరకు ప్రార్థించవలసి యున్నప్పుడు, వారు చేయు ప్రార్థనలలో చేర్చవలసిన అంశముల గూర్చి కచ్చితముగా తెలిసినవారై యుండరు. అనారోగ్య పరిస్థితుల గూర్చిన విన్నపములు మరియు వ్యక్తిగత అవసరతలు బహుశా అతి తరుచుగా ప్రార్థించబడు అంశములై యుండును. మనము ఇతరుల కొరకు దేవుని సన్నిధిలో విన్నపములు చేయునప్పుడు చేర్చవలసిన అంశముల గూర్చి పౌలు ప్రార్థనలు మనకు మంచి పరిజ్ఞానము నిచ్చును.

ఆయన వారి కొరకు ప్రార్థించుచున్నాడని పౌలు కొలొస్సయులకు తెలియజేసాడు (1:3, 4). ఆయన నిర్దిష్టమైన ఆధ్యాత్మిక ఆశీర్వాదముల కొరకు, దైవభక్తిని ప్రదర్శించు లక్షణముల అభివృద్ధి కొరకు, మరియు వ్యక్తిగత అవసరముల కొరకు ప్రార్థించాడు. క్రైస్తవులందరును చేయవలసినది కూడా ఇదే. "నేను దేవునికి ప్రార్థించునప్పుడు, నీ విశ్వాసము మరియు ప్రేమ, పరలోకమందు నీ కొరకు ఉంచబడిన నిరీక్షణ, మరియు ఫలదాయకమైన నీ జీవితమునుబట్టి నేను ఆయనకు వందనములు చెల్లిస్తుంటాను" అని ఎవరైన ఒకరు ప్రభువునందు సహోదరుడైన ఒకనికి చెప్పినట్లయితే, అతడు పొందుకొను ప్రోత్సాహము ఎంతో ప్రోత్సాహకరమైనదై యుండును కదా, ఒక్కసారి ఆలోచించండి! ఇటువంటి అభయము ఆ సహోదరునికిని మనకును మధ్య బలమైన బంధమును సృష్టించి ఆతని ఆత్మను ఉన్నతాశయముల దిశగా

లేవనెత్తును.

**క్రియలతో కూడిన విశ్వాసము (1:4)**

"నేను చెప్పు మాటలు ప్రకారము మీరు చేయక, 'ప్రభువా, ప్రభువా,' అని నన్ను పిలుచుట ఎందుకు?" అని యేసు ప్రశ్నించాడు (లూకా 6:46). యేసును ప్రభువుగా మాత్రమే గుర్తించుట చాలదు. ఒకడు విశ్వాసముంచు దేవుని చిత్తమునకు వాడు ప్రతిస్పందించునట్లు వాని విశ్వాసము వానిని ప్రేరేపించును.

(1) *విశ్వాసము ద్వారా ప్రోత్సాహింపబడు కార్యములు,* విశ్వాసమునకు గల ప్రోత్సాహమునిచ్చు స్వభావము గూర్చి హెబ్రీ పత్రిక 11వ అధ్యాయం. అనేక ఉదాహరణములను వివరించుచున్నది: హేబెలు అంగీకార యోగ్యమైన అర్పణ అర్పించాడు (వచనం 4); నోవాహు ఓడను నిర్మించాడు (వచనం 7); దేవుడు వాగ్దానము చేసిన దేశమునకు వెళ్లుటకు అబ్రాహాము తన స్వదేశమును విడిచిపెట్టాడు (వచనం 8); ఇశ్రాయేలీయులు యెరికో పట్టణము చుట్టూర ప్రదక్షిణము చేసారు (వచనం 30); రాహాబు ఇశ్రాయేలీయుల వేగుల వారికి తోడ్పడినది (వచనం 31). విశ్వాసమునుబట్టి అబ్రాహాము యొక్క చర్యలు, ఆయన "విశ్వాసము పరిపూర్ణము చేయబడినది" (యాకోబు 2:22). అబ్రాహాము చర్య తీసికొననంత వరకు, ఆయన విశ్వాసము సంపూర్ణమైనదై యుండలేదు, లేక "పరిపూర్ణము" చేయబడలేదు. విశ్వాసము శక్తిమంతమైన ప్రోత్సాహకారియై యున్నది, గనుక మనము దేవుని చిత్తమునకు ప్రతిస్పందించునట్లు అది మనలను పురికొల్పును.

(2) *సజీవమైన విశ్వాసమునకు క్రియలు సంకేతములై యున్నవి.* క్రియలు లేని విశ్వాసము మృతమైనదనియు, అది నిరర్థకమనియు యాకోబు రచించాడు (యాకోబు 2:17, 20, 24, 26). ఒక కుక్క మృతిచెందినప్పటికిని అది కుక్కయే అయియుంటుంది: కానీ, చచ్చిపోయిన కుక్క ఎటువంటి చర్యకు పాల్పడజాలదు. విశ్వాసము విషయము కూడా అంతే. ఉగ్రూతలూగించునదియు సజీవమైనదైన విశ్వాసములో క్రియాశీలక చర్యలు చుట్టుముట్టబడియుండును.

(3) *క్రియలు దేవుని సందేశమునకు ప్రతిస్పందనయై యున్నవి.* దేవుని మార్మికమైన ఒక అనుభూతి లేదా పరిశుద్ధాత్మ సూటిగా పనిచేయుట ద్వారా విశ్వాసమును మానవ హృదయంలో నేరుగా నెలకొల్పడు. దేవుని సందేశమునకు సరైన విధంగా ప్రతిస్పందించుట ద్వారా విశ్వాసము కలుగునని పరిశుద్ధ గ్రంథము చాటి చెప్పుచున్నది: "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమీయులకు 10:17). ఆయన తన వాక్యమును వరముగా అనుగ్రహించుటయే విశ్వాసమును కలుగజేయుటలో దేవుని పాత్రయై యున్నది. అనుగ్రహింపబడిన వాక్యమును అంగీకరించుట, మానవుని పాత్రయై యున్నది. మానవులు వాటిని గూర్చి తెలిసికొని యేసునందు విశ్వాసముంచుట ద్వారా నిత్య జీవము పొందునట్లు యేసు చేసిన అద్భుతములు గ్రంథస్తం చేయబడినవి (యోహాను 20:30, 31). వారికి ప్రబోధింపబడిన సువార్తను వినిన తరువాత, సమరయులు మరియు కొరింథీయులు యేసునందు విశ్వాసముంచారు (అపొస్తలుల కార్యములు 8:5, 12; 18:8). "సత్యవాక్యమును, అనగా రక్షణ సువార్తను వినిన తరువాత విశ్వాసముంచిన" ఎఫెస్సు పట్టణ క్రైస్తవుల విషయంలో కూడ ఇదే జరిగినది (ఎఫెసీయులకు 1:13).

**ఇతరులకు ఉపదేశించుట (1:6)**

వారు వాక్యము వినిన తరువాత ఆలస్యం చేయక వెనువెంటనే వారు నేర్చుకొనిన సత్యమును కొలొస్సయులు ఇతరులకు నేర్పించుటకు మొదలుపెట్టారు. నూతన విశ్వాసులకు ఉపదేశింపవలెను, వారికి శిక్షణనీయవలెను, మరియు వారు నేర్చుకొనిన సత్యములను ఇతరులతో పంచుకొనునట్లు వారిని ప్రోత్సాహించవలెను.

"నీవు అనేక సాక్షుల యెదుట, నా వలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము" అని పౌలు తిమోతికి వ్రాసాడు (2 తిమోతి 2:2). సముచితమైన సమయము తరువాత, నేర్పించుటకు సామర్థ్యము కలిగియుండి యేసు ఉపదేశముల గూర్చిన తెలివియందు అభివృద్ధిచెంది పరిపూర్ణులగు విశ్వాసులైన క్రైస్తవులు దేవుని వాక్యమును ఉపదేశించు సార్థకమైన ఉపదేశకులు కాగలరు.

ఉపదేశించుటకు అంతర్గత శక్తిగలవారు వారి సామర్థ్యమును అభివృద్ధి చేసికొనవలెనని దేవుడు అపేక్షించుచున్నాడు. తోటి సహోదరులను బలపర్చుటకు సంఘమునకు హితమైన ఉపదేశకులు అవసరమై యున్నారు (ఎఫెసీయులకు 4:11, 12), మరియు యేసు క్రీస్తు ద్వారానే కలుగు రక్షణ సువర్తమానమును చాటించుటకు లోకమునకు సువార్తికులు కావలసి యున్నారు (రోమీయులకు 10:14, 15). మొదటి శతాబ్దము నాటి క్రైస్తవుల చేత మార్గదర్శకముగా ఏర్పాటుచేయబడినట్లు, ఇతరులు ఇంకొందరికి ఉపదేశించు నమూనాను మనము కొనసాగించుచుందుముగాక!

---

సూచనలు

[1]రోమీయులకు 1:8; 1 కొరింథీయులకు 1:4; ఎఫెసీయులకు 1:16, 17; ఫిలిప్పీయులకు 1:3; కొలొస్సయులకు 1:3; 1 థెస్సలొనీకయులకు 1:2; 2 థెస్సలొనీకయులకు 1:3; 2 తిమోతి 1:3; ఫిలేమోను 4 వచనాలు. [2]రోమీయులకు 1:10; 10:1; 2 కొరింథీయులకు 13:7, 9; ఎఫెసీయులకు 1:16; ఫిలిప్పీయులకు 1:4, 9; ఫిలేమోను 4; 1 థెస్సలొనీకయులకు 1:2; 2 థెస్సలొనీకయులకు 1:11; 2 తిమోతి 1:3. [3]Robert G. Bratcher and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letters to the Colossians and to Philemon,* Helps for Translators (New York: United Bible Societies, 1977), 8. [4]రోమీయులకు 5:2–5; 1 కొరింథీయులకు 13:13; గలతీయులకు 5:5, 6; ఎఫెసీయులకు 4:2–5; 1 థెస్సలొనీయులకు 1:3; 5:8; హెబ్రీయులకు 6:10–12; 10:22–24; 1 పేతురు 1:3–8, 21. ఈ పరిస్థితులో పౌలు ఉపయోగించిన ఇతరమైన కీలక పదములలో "సువార్త" మరియు "కృప" కూడ ఉన్నవి (కొలొస్సయులకు 1:5బి, 6). [5]J. B. Lightfoot, *St. Paul's Epistles to the Colossians and to Philemon,* rev. (London: Macmillan & Co., 1916), 130. [6]Herbert M. Carson, *The Epistles of Paul to the Colossians and Philemon: An Introduction and Commentary,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960), 30. [7]Lightfoot, 131. [8]E. K. Simpson and F. F. Bruce, *Commentary on the Epistles to the Ephesians and the Colossians,* The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1957), 180. [9]A. T. Robertson, *A Grammar of the Greek New Testament in the Light of Historical Research* (Nashville: Broadman Press, 1934), 27. [10]R. C. Lucas, *The Message of Colossians and Philemon: Fullness and Freedom,* The Bible Speaks Today (Downers Grove, Ill.: InterVarsity Press, 1980), 29.

[11]Lightfoot, 133. [12]అపొస్తలుల కార్యములు 2:41; 4:4; 6:7; 8:14; 11:1; 12:24; 17:11; 19:20. [13]Carson, 33. [14]*The Greek New Testament,* 4th rev. ed., ed. Barbara Aland, Kurt Aland, Johannes Kara-

vidopoulos, Carlo M. Martini, and Bruce M. Metzger (Stuttgart: United Bible Societies, 1998). [15]కొలొస్సయులకు 2:5లో, NASB "ఆత్మలో/తో" అనియు, KJV "(ఆ/అదే) ఆత్మలో/తో" అనియు అనువదించుచున్నవి. [16]William Hendriksen, *Exposition of Colossians and Philemon,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1964), 54. [17]Alexander Campbell, George Campbell, James Macknight, and Philip Doddridge, *The Sacred Writings of the Apostles and Evangelists of Jesus Christ: Commonly Styled the New Testament* (Buffaloe, Va.: A. Campbell, 1826; reprint, Nashville: Gospel Advocate Co., 1974), 359; and J. B. Rotherham, *The Emphasized New Testament: A New Translation*, in *The Word, the Bible from 26 Translations,* ed. Curtis Vaughan (Gulfport, Miss.: Mathis Publishers, 1991), 2394. [18]Hugh J. Schonfield, *The Authentic New Testament* (New York: New American Library of World Literatue, 1954), 331.